KANCHARLA
# మనసులో మాట
సంచలన తెలుగు దిన పత్రిక

## ఉత్తరాంధ్ర

| | | |
|---|---|---|
| విశాఖపట్నం | విజయనగరం | అనకాపల్లి |
| శ్రీకాకుళం | అల్లూరి జిల్లా (పాడేరు) | పార్వతీపురం |

శనివారం 11 జులై 2026 పేజీలు 16




# జీతాలు పెంపుకై అంగన్వాడీల భారీ ఆందోళన

- నెహ్రూ చౌక్ లో మానవహారం
- ఎన్టీఆర్ స్టేడియంలో సభ

**అనకాపల్లి టౌన్ జూలై 10, మనసులో మాట**

అంగన్వాడీలకు కనీస వేతనం 26,000 ఇవ్వాలనే డిమాండ్ పై శుక్రవారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద సిఐటియు కార్యాలయం నుండి నెహ్రూ చౌక్ మీదుగా ఎన్టీఆర్ స్టేడియం వరకు భారీ నిరసన ర్యాలీని నిర్వహించారు. నాలుగు రోడ్లు నెహ్రూ చౌక్ లో మానవహారం జరిగింది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జీతాలు పెంపుదలపై ప్రకటన చేయాలని పెద్ద ఎత్తున అంగన్వాడి కార్యకర్తలు నినదించారు.

ఈ ఆందోళనలో ముఖ్య అతిథిగా పాల్గొన్న రాష్ట్ర సిఐటియు అధ్యక్షులు సిహెచ్ నర్సింగరావు అంగన్వాడి యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు, సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వివి శ్రీనివాసరావు, ఆర్ శంకర్రావు లు. అంగన్వాడి యూనియన్ జిల్లా అధ్యక్షులు దుర్గారాణి అధ్యక్షతన ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన సభలో మాట్లాడుతూ.....

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ఐసిడిఎస్ లక్ష్యానికి విరుద్ధంగా అనేక యాప్ లు తీసుకువస్తున్నారు

..మిగతా 2లో

# సీజనల్ జ్వరాలపై అపోహలు వద్దు

- జ్వరాల కోసం ప్రత్యేక డ్రైవ్
- కొండ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలి
- పల్లెల్లో పారిశుధ్యం తప్పనిసరి
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్




02



# రేషన్ కోసం లబ్ధిదారులు పడి గాపులు

- గిరిజనులకు తీవ్ర కష్టాలు

02



# జిల్లా పోలీసుశాఖలో భారీగా బదిలీలు

- 19మంది ఎఎస్ఐలు, 42 మంది హెచ్ సి లు, 61 మంది కానిస్టేబుళ్ళు బదిలీ

12

## రూ. 4 కోట్లతో బీటీ రోడ్డు పనులకు
# శంకుస్థాపన...

- 10 గ్రామాలకు తీరనున్న రవాణా కష్టాలు

02



# వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యం కావాలి

- ఎమ్మెల్యే కూన రవికుమార్

**శ్రీకాకుళం, మనసులో మాట, జిల్లా ప్రతినిధి జులై 10:**




దేశంలో వ్యవసాయాన్ని లాభసాటి రంగంగా తీర్చిదిద్దేందుకు శాస్త్రీయ పద్ధతులు, ఆధునిక సాంకేతికత, సమర్థవంతమైన నీటి నిర్వహణ, మార్కెట్ అనుసంధానం వంటి అంశాలకు ప్రభుత్వాలు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని ఆమదాలవలస శాసనసభ్యులు, ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ (పీయూసీ) ఛైర్మన్ కూన రవికుమార్ పిలుపునిచ్చారు. న్యూఢిల్లీలోని ఇండియా ఇంటర్నేషనల్ సెంటర్‌లో పీఆర్‌ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో వ్యవసాయం, భూమి, నీటి వనరులపై నిర్వహిస్తున్న రెండు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో శుక్రవారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా అమలవుతున్న ఉత్తమ వ్యవసాయ విధానాలను అధ్యయనం చేసి, వాటిలో రైతులకు ఉపయోగపడే అంశాలను రాష్ట్రంలో అమలు చేయడానికి శాయశక్తులా కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఇలాంటి జాతీయ స్థాయి మేధోమథన చర్చలు ప్రజాప్రతినిధులకు విస్తృత అవగాహన కల్పించడంతో పాటు భవిష్యత్తు విధాన రూపకల్పనలో కీలకంగా ఉపయోగపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ రెండు రోజుల జాతీయ స్థాయి వర్క్‌షాప్‌లో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల ప్రజాప్రతినిధులు, విధాన రూపకర్తలు, వ్యవసాయ నిపుణులు, పరిశోధకులు పాల్గొని వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లు, సాధ్యమైన పరిష్కార మార్గాలపై విస్తృతంగా చర్చించారు. ముఖ్యంగా రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేసేందుకు అనుసరించాల్సిన వ్యూహాలు, వ్యవసాయ ఉత్పత్తులకు మెరుగైన అంతర్జాతీయ మార్కెట్ సౌకర్యాలు కల్పించడం, భూ పరిపాలనలో పారదర్శకతను తీసుకురావడం, నీటి వనరుల సమర్థ నిర్వహణతో పాటు వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకునే వ్యవసాయ విధానాలపై నిపుణులు పలు కీలక సూచనలు చేశారు. రైతుల అభ్యున్నతే ధ్యేయంగా సాగిన ఈ సదస్సులో పాల్గొనే అవకాశం లభించడం పట్ల కూన రవికుమార్ హర్షం వ్యక్తం చేశారు.

## లైన్ కొత్తూరు లో రైతులకు వరి విత్తనాల పంపిణీ

**ఎలమంచిలి టౌన్, జులై 10, మనసులో మాట,**



మండలంలోని లైను కొత్తూరు రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం నాడు రైతులకు వరి విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఎలమంచిలి మండల తెలుగు మహిళ, మాజీ జెడ్పిటిసి రాజాన నారాయణమ్మ, లైన్ కొత్తూరు మాజీ సర్పంచ్, జనసేన నాయకులు లవుడు లోవ రాజు ఈ విత్తన పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో రైతులకు సకాలంలో విత్తనాలు అందించడం జరుగుతుందని, మేలు రకం , అధిక దిగుబడి రకాల విత్తనాలు ఇవ్వడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి కార్యకర్తలు సచివాలయం సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

## బీబీ పట్నం హైస్కూల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో విద్యార్థి నాయకుల ఎన్నికలు

**రోలుగుంట జులై 10 మనసులో మాట.**




బి.బి.పట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. విద్యార్థి నాయకుల ఎన్నికల సందర్భంగా పాఠశాల ప్రాంగణం ప్రజాస్వామ్య పండుగలా మారింది. అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం బీబీ పట్టణంకు చెందిన ఈ పాఠశాలలో విద్యార్థులు ఎంతో ఆసక్తితో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రధానోపాధ్యాయుడు ఎస్వీ చంద్రశేఖర్ రావు పర్యవేక్షణలో ఎన్నికల ప్రక్రియ క్రమబద్ధంగా సాగింది. ఓటింగ్ సమయంలో విద్యార్థుల్లో ఉత్సాహం స్పష్టంగా కనిపించింది. ప్రతి ఒక్కరూ తమ అభిరుచికి అనుగుణంగా నాయకులను ఎన్నుకోవడంలో పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో స్కూల్ పీపుల్ లీడర్ (ఎస్‌పిఎల్)గా గంజి లక్ష్మీ ప్రసాద్ విజయం సాధించగా, సెకండ్ (ఎస్‌పిఎల్) గా గోదె భవ్యశ్రీ ఎన్నికయ్యారు. విజేతలను సహ విద్యార్థులు అభినందించగా, పాఠశాలలో ఆనంద వాతావరణం నెలకొంది. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఈ విధమైన ఎన్నికలు ఎంతో ఉపయోగకరమని ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య విలువలను చిన్న వయస్సు నుంచే అలవాటు చేయడం ముఖ్యమని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు చురుకుగా పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయంలో విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన

**రోలుగుంట, జులై 10 మనసులో మాట.**



రోలుగుంట మండలం అర్ల గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో విత్తన శుద్ధిపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 100 శాతం ప్రకృతి వ్యవసాయం అమలవుతున్న ఈ గ్రామంలో రైతులతో కలిసి సామూహికంగా వరి విత్తనాలకు బీజామృతంతో విత్తన శుద్ధి చేపట్టారు. ఈ సందర్భంగా డివిజన్ ఎంటీ వరలక్ష్మి విత్తన శుద్ధి వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. పీఎండీఎస్ అమలు చేసిన నెల రోజుల అనంతరం ఫీల్డ్ విజిట్ కూడా నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి చిరంజీవి మాట్లాడుతూ, రైతులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను పాటించడం ద్వారా మంచి దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఆర్ఏఆర్ఎస్ నుండి డాక్టర్ అప్పలస్వామి (షుగర్‌కేన్), డాక్టర్ ఎం. చంద్రశేఖర్ రెడ్డి (ఎకనామిక్స్), డాక్టర్ వి. చంద్రశేఖర్ (పథాలజీ), డాక్టర్ డి. ఉమా మహేశ్వరరావు (ఎక్స్టెన్షన్), మండల వ్యవసాయ అధికారి చిరంజీవి, గ్రామ సర్పంచ్ నూకరాజు, రైతులు, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, డివిజన్ ఇంచార్జి వరలక్ష్మి, యూనిట్ ఇంచార్జి గంగరాజు, ఐసీఆర్‌పీఎస్ సభ్యులు పాల్గొన్నారు.

## పీవీఎన్ మాధవ్ బిజెపి పార్టీ అభివృద్ధికి నిరంతర కృషి.....

- బిజెపి రాష్ట్ర పార్టీ అధ్యక్షుడిగా ఏడాది పూర్తి......
- అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి హర్షం...

**అనకాపల్లి రూరల్, జులై 10 (మనసులో మాట):**



రాష్ట్రంలో బిజెపి పార్టీ అభివృద్ధికి అపర్షిశలు కృషి చేసి పార్టీ అభివృద్ధికి దోహదపడిన పివిఎన్ మాధవ్ అభినందనీయులని అనకాపల్లి జిల్లా బిజెపి పార్టీ అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. పీవీఎన్ మాధవ్ రాష్ట్ర పార్టీ అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టి ఏడాది విజయవంతంగా పూర్తి చేసిన శుభ సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం అనకాపల్లిలో ఉన్న జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా బిజెపి పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, బొడ్డేడ నాగేశ్వరరావు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాధవ్ నాయకత్వంలో నిరంతర కార్యక్రమాలు చేపట్టి ఎవరు ఊహించని విధంగా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా విశేషంగా బలోపేతం అయిందని వారు కొనియాడారు. మాధవ్ చిన్నతనం నుంచి జాతీయ నేత పీవీ చలపతిరావు క్రమ శిక్షణలో ఆర్ఎస్ఎస్ భావజాలన, నైతిక విలువలు, నీతి నిజాయితీ, ఏ అంశంపైనైనా అనర్గళంగా తనదైన వాగ్ధాటితో ఆకర్షించడం ఆయనకు ఆయనే సాటి అన్నారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలు, పార్టీ పెద్దలతో ఆత్మీయ సంబంధాలు కలిగి ఉండడం, మోడీజీ ప్రవేశపెట్టిన దేశ దిశ దశ మార్చిన అద్భుత పథకాలపై ప్రజలలో విస్తృత ప్రచారం జరగడం ఆయన కృషి అన్నారు. మాధవ్ పార్టీని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు సమన్వయంతో వ్యవహరిస్తూ, మరింత పటిష్టం చేసే దిశగా అనేక కార్యక్రమాలను చేపట్టి విజయవంతం చేసి అందరి చేత శభాష్ అనిపించుకున్నారన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, పార్టీ విస్తరణ, సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాటం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రచారం, ఆయన ప్రత్యేక చొరవ చూపారనికొనియాడారు. రాష్ట్రంలో బీజేపీని ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో మాధవ్ సమర్థవంతమైన నాయకత్వాన్ని అందిస్తున్నారని, రానున్న రోజుల్లో పార్టీ మరింత బలపడుతుందని పరమేశ్వరరావు, నాగేశ్వరరావు ప్రగాఢ విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.

## కాశీబుగ్గ లో గుర్తుతెలియని వ్యక్తి మృతి దేహం.. మూడు రోడ్ల జంక్షన్ వద్ద కలకలం..

**పలాస, జులై 10 ,మనసులో మాట ..**



కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని మూడు రోడ్ల జంక్షన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికంగా కలకలం రేగింది. శుక్రవారం ఉదయం రోడ్డు పక్కన ఒక వ్యక్తి మృతదేహాన్ని గమనించిన స్థానికులు వెంటనే కాశీబుగ్గ పోలీసులకు సమాచారం అందించారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి, తదుపరి చర్యలు చేపట్టారు. మృతుడి వివరాలు ఇంకా తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు ఎవరు? ఎక్కడి వ్యక్తి? ఎలా మృతి చెందారు? అనే కోణాల్లో విచారణ ప్రారంభించారు. రద్దీగా ఉండే మూడు రోడ్ల జంక్షన్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కనిపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. మృతికి గల కారణాలు ఇంకా తెలియలేదు. రద్దీగా గా ఉండే మూడు రోడ్ల కూడలి దగ్గర గుర్తు తెలియని వ్యక్తి శవం కనిపించింది. దీంతో స్థానికులు భయపడ్డారు. చనిపోవడానికి కారణం ఇంకా తెలియలేదు. ఈ కేసును కాశీబుగ్గ పోలీసులు విచారిస్తున్నారు. మృతుడు ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారు అనే వివరాల కోసం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎమ్మెల్యే ప్రజా దర్బార్‌లో 25 వినతుల స్వీకరణ..

- 15 రోజుల్లో పరిష్కారం చూపాలి,అధికారులకు ఎమ్మెల్యే ఎంజీఆర్ ఆదేశాలు..



**పాతపట్నం, జూలై 10 మనసులో మాట:**

ప్రజల సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు (ఎంజీఆర్) అన్నారు. శుక్రవారం పాతపట్నం నియోజకవర్గ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుంచి నేరుగా వినతులు స్వీకరించి, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ సందర్భంగా మొత్తం 25 వినతిపత్రాలు ఎమ్మెల్యేకు అందాయి. రెవెన్యూ, రహదారులు, విద్యుత్, తాగునీటి సమస్యలతో పాటు రేషన్ కార్డులు, సామాజిక భద్రత పింఛన్లు, ఇళ్ల స్థలాలు, గృహ నిర్మాణాలు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు సంబంధించిన వ్యక్తిగత సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు.ప్రతి వినతిని పరిశీలించిన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని అధికారులను హెచ్చరించారు. ప్రతి అర్జీపై బాధ్యతాయుతంగా చర్యలు తీసుకుని 15 రోజుల్లోగా సమస్యలను పరిష్కరించి, పరిష్కార వివరాలను సంబంధిత దరఖాస్తుదారులకు తెలియజేయాలని స్పష్టం చేశారు.ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం ప్రజాప్రతినిధులు, అధికారుల బాధ్యత అని పేర్కొన్న ఎమ్మెల్యే, ప్రజా దర్బార్ ద్వారా ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలకు సత్వర పరిష్కారం అందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని వెల్లడించారు.

## ఫసల్ బీమా యోజన ప్రారంభించిన వ్యవసాయ అధికారి రాం ప్రసాద్

**శృంగవరపుకోట, జులై 10: (మనసులో మాట )**



ప్రధాన మంత్రి ఫసల్ భీమా యోజన పథకం లో భాగంగా ఖరీఫ్ 2026 , రబీ 2026 27 గాను నమోదు ప్రక్రియ ప్రారంభం అయింది అని, రైతులు స్వచ్ఛందంగా మీసేవ లో నమోదు చేసుకోవాలని, ప్రకృతి వైపరీత్యాల కారణంగా జరిగే నష్టాల నుంచి రైతులు ఆర్థిక రక్షణ పొందేందుకు అవకాశం ఉంటుందని మండల వ్యవసాయ అధికారి కే వి రామ్ ప్రసాద్ తెలిపారు, వరి పంట సాగు చేస్తున్న రైతులు ఎకరాకు ప్రీమియం రూ. 200 ఆగస్టు 15 తేదీ లోపల చెల్లించాలని , ఈ అవకాశం అందరూ సద్వినియోగం చేసుకుంటారని , ఈ భీమా కోసం ఈ పంట నమోదు చేసుకోవాల్సి ఉంది అని, సాగు ధృవీకరణ పత్రాలు సమర్పించాలని తెలిపారు, గడువులోగా రైతులు అందరూ ప్రీమియం చెల్లించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## మహిళల భద్రత, సైబర్ నేరాలపై అవగాహన

**రాంబిల్లి జులై 10 మనసులో మాట**



రాంబిల్లి మహిళలపై జరుగుతున్న నేరాలు, సైబర్ నేరాల నివారణ, విద్యా ప్రాధాన్యం, ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థుల్లో అవగాహన కల్పించే లక్ష్యంతో రాంబిల్లి పోలీస్ స్టేషన్ ఎస్సై దినకర్ ఆధ్వర్యంలో సిబ్బంది శుక్రవారం పంచదార్ల జెడ్పీ హైస్కూల్‌లో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మహిళల రక్షణకు అమల్లో ఉన్న చట్టాలు, సైబర్ మోసాల నుంచి అప్రమత్తంగా ఉండాల్సిన విధానం, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఎలా సంప్రదించాలనే అంశాలను వివరించారు. అలాగే విద్యే జీవితానికి పునాది అని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# రైతులకు ఉద్యాన పంటల సాగుపై కలెక్టర్ పిలుపు

**గుర్ల జులై 10,(మనసు లో మాట )**



గుర్ల మండలం జమ్ము గ్రామంలో నిర్వహించిన ఆయిల్ పామ్ సాగు విస్తరణ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ఆయిల్ పామ్ మొక్కలను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయిల్ పామ్ సాగు చేస్తున్న రైతులతో ముఖాముఖి నిర్వహించి, సాగు విధానాలు, తోటల నిర్వహణ, దిగుబడులు, మార్కెటింగ్, ఆదాయం, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "మిషన్ హార్టికల్చర్" కార్యక్రమంలో భాగంగా జిల్లాలో సాంప్రదాయ పంటల నుంచి అధిక ఆదాయం అందించే ఉద్యాన పంటల వైపు పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఉద్యాన పంటల విస్తరణ ద్వారా రైతుల ఆదాయం పెరగడంతో పాటు నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవచ్చని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ పంట దీర్ఘకాలికంగా స్థిరమైన ఆదాయాన్ని అందించే అత్యంత లాభదాయక ఉద్యాన పంటలలో ఒకటని, అనుకూల భూభాగాలు కలిగిన రైతులు ఈ పంట సాగును స్వీకరించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగుకు ప్రభుత్వం ఉద్యానశాఖ ద్వారా నాణ్యమైన మొక్కలు, సాంకేతిక మార్గదర్శకాలు, అవసరమైన ప్రోత్సాహకాలు అందిస్తోందని వివరించారు. అలాగే, ఆయిల్ పామ్ తోటల్లో మైక్రో నీటి ఇరిగేషన్ (డ్రిప్ ఇరిగేషన్) విధానాన్ని తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని, దీనివల్ల నీటి పొదుపుతో పాటు పంట పెరుగుదల, దిగుబడులు మెరుగుపడతాయని కలెక్టర్ తెలిపారు. రైతుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్న కలెక్టర్, వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైతులకు ఎప్పటికప్పుడు సాంకేతిక సూచనలు అందించి ఆయిల్ పామ్ సాగు విస్తరణకు కృషి చేయాలని ఉద్యానశాఖ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి కె. చిట్టిబాబు, ఎపిఎంఐపి పిడి పివిఎస్ వి లక్ష్మీనారాయణ, ఉద్యానశాఖ అధికారులు ఎం. అనూష, వి.హెచ్.ఏ. రామకృష్ణ, ఆయిల్ పామ్ సంస్థ ప్రతినిధులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, ప్రగతిశీల రైతు కురుమునెల్లి బంగారు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ జనాభా దినోత్సవం పై అవగాహన

**పాలకొండ, జులై 10,మనసులో మాట :**



జూలై 11 ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లా పాలకొండ పట్టణం లో గాయత్రి స్కూల్ ఆఫ్ నర్సింగ్ శిక్షణ కేంద్రం లో వాలంటరీ హెల్త్ అసోసియేషన్ గుంటూరు వారి సౌజన్యంతో, జన చేతన సంస్థ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమం జరిగింది. ముందుగా "చిన్న కుటుంబం - చింత లేని కుటుంబం కుటుంబం" అనే నినాదాన్ని విద్యార్థినిలచే పలికించడం జరిగింది.అనంతరం శిక్షణా కేంద్రం కరెస్పాండంట్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ 1989లో ఐక్యరాజ్యసమితి దీనిని ప్రారంభించిన నాటి నుండి ప్రతి సంవత్సరం జూలై 11వ తేదీన మనం ప్రపంచ జనాభా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. నానాటికీ పెరుగుతున్న జనాభా వల్ల కలిగే సమస్యలపై ప్రపంచవ్యాప్తంగా ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ఈ రోజును ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. కేంద్రం డైరెక్టర్ డి.అచ్యుత రావు మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో జనాభా పెరిగిపోవడం వల్ల అనేక సమస్యలు ఎదురవుతున్నాయి,ముఖ్యంగా సహజ వనరులు తగ్గిపోయి, నిరుద్యోగం పెరుగుతోందని అన్నారు.జనచేతన కోఆర్డినేటర్ ఎం.సరస్వతి మాట్లాడుతూ ప్రపంచ జనాభాలో మన దేశం కూడా ముందు వరుసలోనే ఉంది కాబట్టి పెరుగుతున్న జనాభాకు తగినట్లుగా ఆహారం,నీరు,నివాసం మరియు నాణ్యమైన విద్య అందేలా చూడాలన్నారు.అలాగే, లింగ సమానత్వం, ఆరోగ్య సంరక్షణ మరియు ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్య అందేలా చూడాలన్నారు. మనం కేవలం జనాభాను తగ్గించడం గురించే కాకుండా, ఉన్న జనాభాను ఆరోగ్యంగా, నైపుణ్యం కలిగిన మానవ వనరులుగా ఎలా మార్చుకోవాలనే దానిపై దృష్టి పెట్టాలని కోరారు.

# జర్నలిస్ట్ తిరుమలపై దాడి టీడీపీ నేతపై ఫిర్యాదు

**పలాస, , జులై 10, మనసులో మాట**



శ్రీకాకుళం జిల్లా పలాసలో విధి నిర్వహణలో ఉన్న ఓ జర్నలిస్ట్‌పై దాడి జరిగినట్లు ఆరోపణలు వెలువడ్డాయి. అక్రమ తవ్వకాల సమాచారాన్ని కవర్ చేయడానికి వెళ్లిన సమయంలో తనపై భౌతిక దాడి జరిగిందని బీఆర్‌కే న్యూస్ (BRK News) రిపోర్టర్ యవ్వారి తిరుమల పోలీసులకు ఫిర్యాదు చేశారు.బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం, గురువారం రాత్రి సుమారు 10:30 గంటల సమయంలో పలాస సమీపంలోని గరుడుకండి వద్ద ఉన్న పెట్రోల్ బంక్ వెనుక చెరువు ప్రాంతంలో రాత్రి వేళ తవ్వకాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో అక్కడికి వెళ్లారు. రోడ్డుపై నిలబడి తవ్వకాల దృశ్యాలను వీడియో చిత్రీకరిస్తుండగా అక్కడి నుంచి ఒక లారీ బయలుదేరింది. అనంతరం పల్సర్ బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి, ఆ తవ్వకాలు టీడీపీ పలాస పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజుకు సంబంధించినవని,మొక్కల పెంపకం కోసం మట్టిని తరలిస్తున్నామని చెప్పినట్లు బాధితుడు తెలిపారు. ఈ క్రమంలో అక్కడున్న వ్యక్తులు ఫోన్ చేయడంతో టీడీపీ పలాస పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు, బూర్లె యోగేశ్వర్‌తో పాటు మరికొందరు అక్కడికి చేరుకుని తనపై, తనతో ఉన్న స్నేహితుడు.జనసేన నాయకుడు ప్రదీప్పై దాడికి పాల్పడ్డారని జర్నలిస్ట్ ఆరోపించారు. దాడి చేయడమే కాకుండా వారు ప్రయాణిస్తున్న స్కూటీని కిందకు తోసేసి బెదిరింపులకు పాల్పడ్డారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనపై పలాస జర్నలిస్ట్ అసోసియేషన్ సభ్యులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. జర్నలిస్టులపై దాడులను ఖండిస్తూ, నిందితులపై వెంటనే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పలాస-కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వై. రామకృష్ణకు అసోసియేషన్ సభ్యులు వినతి పత్రం అందజేశారు. జర్నలిస్టుల భద్రతకు భరోసా కల్పించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇదిలా ఉండగా, బాధితుడు కూడా వెంటనే 112 అత్యవసర సేవలకు సమాచారం ఇచ్చి, అనంతరం పలాస-కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌లో లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. పోలీసులు ఫిర్యాదును స్వీకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.

# విద్య–ఆరోగ్యం–యోగాతోనే ఉజ్వల భవిష్యత్తు

- శ్రీకాకుళం మహిళ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆర్వో ప్లాంట్ కోసం 50 వేల ఆర్థిక సాయం
- ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు
- ప్రముఖ వైద్యులు, జనసేన నాయకులు డాక్టర్ దానేటి





**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జులై 10, మనసులో మాట...**

విద్య, ఆరోగ్యం, యోగాతోనే ఉజ్వల భవిష్యత్తు అని ప్రముఖ వైద్యులు, జనసేన నాయకులు డాక్టర్ దానేటి శ్రీధర్ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం గైనకాలజిస్ట్ సొసైటీ ఆధ్వర్యంలో, ప్రసూతి మరియు స్త్రీల వ్యాధుల విభాగం, కమ్యూనిటీ మెడిసిన్ విభాగం సంయుక్తంగా శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రముఖ ప్రసూతి మరియు స్త్రీల వైద్య నిపుణులు డాక్టర్ దానేటి శ్రీధర్ విద్యార్థినులను ఉద్దేశించి ప్రసంగించారు. దేశాభివృద్ధికి జనాభా నియంత్రణతో పాటు మహిళల విద్య, ఆరోగ్యం, పోషకాహారం, మానసిక ఆరోగ్యం, యోగా, పరిశుభ్రత వంటి అంశాలు ఎంతో కీలకమని వివరించారు. యువత చదువుతో పాటు శారీరక దృఢత్వం కోసం ప్రతిరోజూ యోగా, వ్యాయామాన్ని అలవాటు చేసుకోవాలని సూచించారు. సమతుల్య ఆహారం తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, రక్తహీనత నివారణ, నెలసరి ఆరోగ్యంపై సరైన అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు అందరికీ కూడా ఉచితంగా బ్లడ్ టెస్ట్ చేయిస్తానని తెలిపారు. అలానే విద్యార్థుల కోరిక మేరకు తాగునీటి ఆర్వో ప్లాంట్ ను ఏర్పాటుకు 50 వేల రూపాయలు అందజేశారు. అలాగే సోషల్ మీడియా వినియోగంపై కూడా విద్యార్థినులకు విలువైన సూచనలు చేశారు. సోషల్ మీడియాను వినోదానికి మాత్రమే కాకుండా విద్య, ఆరోగ్యం, ఉద్యోగ అవకాశాలు, నైపుణ్యాభివృద్ధి, వ్యక్తిత్వ వికాసానికి ఉపయోగించుకోవాలని సూచించారు. తప్పుడు ప్రచారాలు, అసత్య సమాచారాన్ని నమ్మకుండా, బాధ్యతాయుతంగా డిజిటల్ వేదికలను వినియోగించాలని తెలిపారు. జనాభా నియంత్రణ, మహిళా సాధికారత, ఆరోగ్య పరిరక్షణ, యోగా ప్రాముఖ్యత, బాధ్యతాయుతమైన సోషల్ మీడియా వినియోగంపై నిర్వహించిన ఈ అవగాహన కార్యక్రమం ఎంతో ప్రయోజనకరంగా సాగింది.

# జనతా వారధికి విశేష స్పందన..

- ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం: జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు..



**పాతపట్నం, జూలై 10 మనసులో మాట:**

ప్రజల సమస్యల పరిష్కారానికి భారతీయ జనతా పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'జనతా వారధి' కార్యక్రమానికి పెద్దపీట వేస్తున్నామని శ్రీకాకుళం జిల్లా బీజేపీ అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు తెలిపారు. శుక్రవారం జిల్లా బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి సంబంధిత ప్రభుత్వ శాఖలు, అధికారులతో సమన్వయం చేసి చర్యలు చేపడతామని అన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారానికి 'జనతా వారధి' కార్యక్రమం సమర్థవంతమైన వేదికగా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. జిల్లా ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన ధ్యేయమని, అందిన ప్రతి అర్జీని పరిశీలించి సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా కృషి చేస్తామని తేజేశ్వరరావు స్పష్టం చేశారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే బీజేపీ లక్ష్యమని, జనతా వారధి ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు నిరంతరం కృషి కొనసాగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జనతా వారధి కోకన్వీనర్ యర్రగుంట్ల జగన్మోహన్, విజయనగరం ఓబీసీ మోర్చా జిల్లా ఇన్‌చార్జి పసుపులేటి సురేష్ సింగ్, జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ బడే తాతారావుతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కార్యకర్తలే టీడీపీ బలానికి మూలస్తంభాలు: ఎమ్మెల్యే గోవిందరావు..

**పాతపట్నం, జూలై 10 మనసులో మాట:**



తెలుగుదేశం పార్టీ కోసం నిస్వార్థంగా శ్రమించే కార్యకర్తలే పార్టీకి అసలైన బలమని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పేర్కొన్నారు. శుక్రవారం పాతపట్నం నియోజకవర్గ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన పార్టీ క్యాడర్ సమావేశంలో ఆయన కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల్లోకి వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను విస్తృతంగా వివరించడంతో పాటు పార్టీ సిద్ధాంతాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని కార్యకర్తలకు సూచించారు. గ్రామస్థాయిలో ప్రజల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని, పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా సమిష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం అంకితభావంతో పనిచేసిన కార్యకర్తలను గుర్తించి వారికి తగిన గౌరవం, బాధ్యతలు కల్పించిన ఘనత తెలుగుదేశం పార్టీకే దక్కుతుందని ఆయన పేర్కొన్నారు. నాయకత్వంపై విశ్వాసంతో, ప్రజల మధ్య నమ్మకాన్ని పెంపొందించేలా ప్రతి కార్యకర్త పనిచేస్తే పార్టీకి మరిన్ని విజయాలు ఖాయమని అన్నారు."ప్రజల మద్దతే పార్టీకి ప్రాణం.. కార్యకర్తలే ఆ బలానికి మూలస్తంభాలు" అని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు స్పష్టం చేశారు.ఈ సమావేశంలో పార్టీ నాయకులు, మండల స్థాయి ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన పి డి ఎస్ యు రాష్ట్రస్థాయి శిక్షణ తరగతులు...





**పలాస, జులై 10 ,మనసులో మాట...**

ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం రాష్ట్ర విద్యా,వైజ్ఞానిక శిక్షణా తరగతులు శుక్రవారం కాశీబుగ్గ టీకేఆర్ కళ్యాణ మండపంలో ఘనంగా ప్రారంభమయ్యాయి.

ఈ తరగతుల ప్రారంభానికి ముందుగా PDSU బిగిపిడికిలి జెండాని రాష్ట్ర అధ్యక్షులు కె.భాస్కర్ ఆవిష్కరించారు. అనంతరం తరగతుల ప్రారంభోపన్యాసం. ఆంధ్ర యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ సూరప్పడు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాకుళం ప్రాంతానికి ఒక ప్రత్యేక ఉంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న విద్యా రంగంలో మార్పులు పట్ల ఒక శాస్త్రీయ అవగాహన ఉన్నటువంటి ప్రాంతమని అన్నారు. ఒక నూతన సమాజాన్ని, దోపిడీ,పీడన లేనటువంటి సమ సమాజాన్ని కోరుకునే పీ డీ ఎస్ యూ ఈరోజు ఈ శిక్షణ తరగతులు నిర్వహించుకోవడం చాలా శుభ పరిణామం అని అన్నారు. శాస్త్రీయ విద్య కోసం విద్యార్థులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

పీ డీ ఎస్ యూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.భాస్కర్, M.వినోద్ కుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, ఎన్నికలలో విద్యార్థులకు,నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయ్యాయన్నారు.

కేంద్ర ప్రభుత్వం విశ్వవిద్యాలయాల్లో కేంద్రీకరణ,కాషాయీకరణ చేస్తుందని,నిరుద్యోగ సమస్య పెంచి ప్రభుత్వ రంగ సంస్థలను,కార్పొరేట్ సంస్థలకు తాకట్టు పెడుతుందని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలు చేయడంలో పూర్తిగా విఫలం అయిందని దుయ్య బట్టిందన్నారు.. పెండింగ్లో ఉన్న రియంబర్స్మెంట్,స్కాలర్షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన రేషనాలైజేషన్ ప్రక్రియలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు.పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్యను దూరం చేసే జీవో నెంబర్ 77రద్దు చేయాలని,ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు

# మున్సిపల్ కాంట్రాక్ట్ వర్కర్స్ ను పర్మినెంట్ చేయాలి

**పాలకొండ, జులై 10,మనసులో మాట :**



రాష్ట్రంలో మున్సిపాలిటీలు కార్పొరేషన్ లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ వర్కర్లందర్నీ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పర్మినెంట్ చేయాలని, అంతవరకు సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాలు అమలు చేసి సమాన పనికి సమాన జీతం ఇవ్వాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మన్యం జిల్లా పాలకొండ పట్టణంలో మున్సిపల్ పట్టణ కమిటీ అధ్యక్షులు పడాల వేణు అధ్యక్షతన జరిగిన సమావేశంలో మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.వై. నాయుడు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్మిక హక్కులు కాలరాయడమే కాకుండా ఇచ్చిన హామీలను కూడా అమలు చేయడం లేదని తెలిపారు. 14 రకాల పౌర సేవలను ప్రైవేటీకరణ చేస్తూ నిర్ణయం చేయడం అంటే కార్మికులకు భద్రతగా ఉన్న ఉపాధిని నాశనం చేయడమేనని అందుకే అలాంటి నిర్ణయాలపై యూనియన్ పోరాడుతుందని తెలిపారు.

చట్టసభలను గౌరవించాల్సిన ప్రభుత్వం కార్మికుల జీతాల విషయంలో సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పులను అమలు చేయడం లేదని దానికోసం పోరాటం కొనసాగిస్తామని తెలిపారు.

60 సంవత్సరాల రిటైర్మెంట్ వయసును 62 ఏళ్లకు పెంచడం, రిటైన్ వారికి నష్టపరిహారం, వారి కుటుంబాలకు ఉద్యోగం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. డ్యూటీ లో ఉండి మరణిస్తున్న వారి కుటుంబాలకు ఎలాంటి భద్రత లేకుండా పోయిందని పాలకవర్గాలు అధికారులు కాళ్లు చుట్టూ తిప్పించుకొని కార్మికుల సంఖ్యలను పెంచకుండా ఉన్నవారిపై తీవ్రపని ఒత్తిడికి సిద్ధపడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికుల పట్ల అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరి నిరసిస్తూ ఈ నెల 30వ తేదీన కార్మికుల సంక్షేమం కోసం, హక్కుల సాధన కోసం, పర్మినెంట్ కోసం కలెక్టర్ ఆఫీసుల వద్ద పెద్ద ఎత్తున ఆందోళనకు యూనియన్ పిలుపునిచ్చిందని, కార్మిక వర్గం కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# ప్రజా క్షేత్రంలో ఎమ్మెల్యే గొండు శంకర్





- శ్రీకాకుళం ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ కార్యక్రమం

**శ్రీకాకుళం, జులై 10 , మనసులో మాట:**

ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, పరిపాలనను ప్రజలకు మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నట్లు శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం విశాఖ 'ఎ' కాలనీలోని తన క్యాంప్ ఆఫీసులో గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను, వినతులను ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. స్థానిక సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు, అభివృద్ధి పనులకు సంబంధించి ప్రజలు సమర్పించిన వినతిపత్రాలను ఎమ్మెల్యే సావధానంగా ఆలకించారు. ఆయా సమస్యల పరిష్కారానికి తక్షణమే స్పందించి, సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే గనిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, సమస్యల పరిష్కారానికి చూపుతున్న చొరవను నియోజకవర్గ ప్రజలు ప్రశంసిస్తున్నారు.

# రిజిస్ట్రేషన్ సేవల ప్రైవేటీకరణను నిలిపివేయాలి..

- కలెక్టరేట్ వద్ద దస్తావేజు లేఖరుల ధర్నా
- లైసెన్సుల పునరుద్ధరణ, ఉపాధి రక్షణకు ప్రభుత్వాన్ని కోరిన సంఘం



**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జులై 10 , మనసులో మాట:**

రిజిస్ట్రేషన్ శాఖ సేవలను ప్రైవేటీకరించే ప్రతిపాదనలను ఉపసంహరించుకోవాలని, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాల ఏర్పాటు నిలిపివేయాలని కోరుతూ శ్రీకాకుళం దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాలంటే రిజిస్ట్రేషన్ వ్యవస్థ ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగాలని అన్నారు. దస్తావేజు లేఖరుల లైసెన్సులను వెంటనే పునరుద్ధరించాలని, డాక్యుమెంట్ రైటర్లు, స్టాంపు వెండర్లు, డీటీపీ ఆపరేటర్ల ఉపాధికి భరోసా కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రిజిస్ట్రేషన్ సేవలను ప్రైవేటీకరిస్తే వేలాది మంది జీవనోపాధి దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేసిన నాయకులు, తమ డిమాండ్లపై ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.

# టీకాల కార్యక్రమాన్ని శతశాతం పూర్తి చేయాలి

## : పశుసంవర్ధకశాఖ ఏడి డాక్టర్ రెడ్డి కృష్ణ





**గంట్యాడ, జులై 10 (మనసులో మాట):**

గంట్యాడ మండలంలో టీకాల కార్యక్రమాన్ని శతశాతం పూర్తిచేయాలని, శుక్రవారం గంట్యాడలో ఏ హెచ్ ఏ లకు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రెడ్డి కృష్ణ సూచించారు. గంట్యాడలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో మండల పరిధిలోని రైతు సేవ కేంద్రాల్లో పనిచేస్తున్న పశుసంవర్ధక శాఖ సహాయకుల పనితీరు పై సచివాలయాల వారీగా పశుసంవర్ధక శాఖ ఏడి డాక్టర్ రెడ్డి కృష్ణ సమీక్షించారు. పాడి రైతులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. అలాగే చిటిక వ్యాధి, గాలికుంటు వ్యాధి, నీలి నాలుక వ్యాధి టీకాల కార్యక్రమం ప్రగతిపై సమీక్ష జరిపి వారికి పలు సూచనలు ఇచ్చారు. పాడి రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి వారి ముంగిటకే పశువైద్య సేవలు అందించాలని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ రెడ్డి కృష్ణ సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి డాక్టర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంలో బీసీ గురుకులాలు, హాస్టళ్లు విద్యార్థులకు 'సొంతిళ్లు' లాంటివి

## : ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

- 10 శాతం డైట్ ఛార్జీల పెంపు, రూ.500 కోట్ల సాస్కి నిధుల కేటాయింపుపై హర్షం
- బీసీల విద్యకు కూటమి ప్రభుత్వం పెద్దపీట
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కి కృతజ్ఞతలు తెలిపిన ఎమ్మెల్యే శ్రీమతి లలిత కుమారి



**శృంగవరపుకోట, జులై 10: (మనుసులో మాట )**

రాష్ట్రంలోని అన్ని సంక్షేమ గురుకులాలు, హాస్టళ్లలో విద్యనభ్యసించే విద్యార్థుల డైట్ బిల్లులను 10 శాతం పెంచుతూ కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఎస్.కోట నియోజకవర్గ శాసనసభ్యురాలు కోళ్ల లలిత కుమారి హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎల్.కోట క్యాంప్ కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ఎంజేపీ (మహాత్మా జ్యోతిబాపూలే) స్కూళ్ల శాశ్వత భవన నిర్మాణాలకు రూ.500 కోట్ల సాస్కి నిధులు మంజూరు చేస్తూ సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు జారీ చేయడం శుభపరిణామన్నారు. బీసీ బిడ్డల చదువు పట్ల, వారి భవిష్యత్తు పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి కి ఉన్న చిత్తశుద్ధికి ఈ డైట్ ఛార్జీల పెంపు, నిధుల మంజూరే నిదర్శనమని ఆమె కొనియాడారు. సంక్షేమ హాస్టళ్లలో ప్రస్తుతమున్న డైట్ ఛార్జీలను 10 శాతం పెంచాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. ప్రస్తుతం పెరుగుతున్న ధరల దృష్ట్యా ఈ నిర్ణయం వల్ల హాస్టల్ విద్యార్థులకు మరింత నాణ్యమైన, రుచికరమైన పౌష్టికాహారం అందించే వీలు కలుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.110 కోట్ల డైట్ బిల్లులను కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విడుదల చేసి, బీసీ విద్యార్థుల పట్ల తమకున్న ప్రేమను చాటుకుందని లలిత కుమారి గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఈ కొద్ది కాలంలోనే ఆరు ఎంజేపీ గురుకుల బాలికల పాఠశాలలను కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేశారని, కొత్తగా పది గురుకుల పాఠశాలలను మంజూరు చేశారని ఎమ్మెల్యే లలిత కుమారి వివరించారు. ఇప్పుడు వీటికి శాశ్వత భవనాలు కల్పించాలన్న లక్ష్యంతో ఏకంగా రూ.500 కోట్ల సాస్కి నిధుల మంజూరుకు ఆదేశించడం పట్ల నియోజకవర్గ బీసీ బిడ్డల తరపున సీఎం చంద్రబాబు కి ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ప్రస్తుతం మన బీసీ గురుకులాల్లో సొంతింటి కంటే మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నామని.. ఇప్పటికే ఇన్వర్టర్లు, సీసీ కెమెరాలు, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశామని ఆమె చెప్పారు. బీసీ బిడ్డలు ఉన్నత చదువులు అభ్యసించడం కోసం సీఎం చంద్రబాబు నాయుడు ఎన్ని కోట్లయినా వెచ్చించడానికి సిద్ధంగా ఉన్నారని, విద్యార్థులంతా ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోళ్ల లలిత కుమారి ఆకాంక్షించారు.

# 73వ వార్డులో డ్రై డే ఫ్రై డే కార్యక్రమం విజయవంతం

**గాజువాక , జులై 10 (మనసులోమాట )**



జీవీఎంసీ 73వ వార్డు,గొంతినవాని పాలెంలో జోన్6 ప్రజారోగ్య విభాగం ఆధ్వర్యంలో డ్రైడే,ఫ్రై డే కార్యక్రమం నిర్వహించారు.డెంగ్యూ, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను నివారించే లక్ష్యంతో చేపట్టిన అవగాహన ర్యాలీని వార్డు తెదేపా క్లస్టర్ ఇన్చార్జ్ బలగ బాలు నాయుడు ప్రారంభించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, పారిశుద్ధ్య సిబ్బంది కలిసి ఇంటింటికి వెళ్లి నీరు నిల్వ ఉండే ప్రదేశాలను పరిశీలించి, దోమల లార్వాను నిర్మూలించే చర్యలు చేపట్టారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించి నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు అవగాహన కల్పించారు.బాలు నాయుడు మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు.ఇళ్లలో, కూలర్లు, డ్రమ్‌లు, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు వంటి వాటిలో నీరు నిల్వ ఉండకుండా వారానికి ఒకసారి ఖాళీ చేసి శుభ్రం చేయాలని సూచించారు.ప్రజల భాగస్వామ్యంతోనే దోమల వ్యాప్తిని అరికట్టడం సాధ్యమవుతుందన్నారు.

# తమ్మినేనిపై ఐ-టీడీపీ ట్రోల్స్‌ను ఖండించిన రెడ్డి శాంతి

- బీసీ నేతలను లక్ష్యంగా చేసుకుని కక్షసాధింపు సరికాదు – అవాస్తవ పోస్టులు తొలగించాలని డిమాండ్..

**పాతపట్నం, జూలై 10 మనసులో మాట:**



మాజీ స్పీకర్, సీనియర్ రాజకీయ నాయకుడు తమ్మినేని సీతారాంపై ఐటీడీపీ సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ట్రోల్స్, అసత్య ప్రచారాలను వైఎస్సార్సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిత్వ హననానికి పాల్పడటం తెలుగు దేశం పార్టీ సంస్కృతిగా మారిందని ఆమె విమర్శించారు.శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో రెడ్డి శాంతి మాట్లాడుతూ, ప్రజా జీవితంలో సుదీర్ఘ అనుభవం, నిష్కళంకమైన రాజకీయ చరిత్ర కలిగిన మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాంపై అసత్య ప్రచారాలు చేయడం దుర్మార్గమని అన్నారు. ప్రజల్లో మంచి గుర్తింపు ఉన్న నాయకుల ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఐటీడీపీ సోషల్ మీడియాను వేదికగా చేసుకుని దుష్ప్రచారం చేస్తోందని ఆరోపించారు.ఉత్తరాంధ్ర అభివృద్ధికి కృషి చేసిన బీసీ నాయకుడిని లక్ష్యంగా చేసుకుని రాజకీయ కక్షసాధింపుకు దిగడం బాధాకరమని పేర్కొన్నారు. బీసీ నాయకులపై టీడీపీ అనుసరిస్తున్న వైఖరి వారి చిన్నచూపుకు నిదర్శనమని విమర్శించారు. రాజధాని వికేంద్రీకరణ అంశంపై సభాపతిగా తన బాధ్యతల్లో భాగంగా చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి సోషల్ మీడియాలో ట్రోల్స్ చేయడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని అన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన టీడీపీ కూటమి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఇలాంటి డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని రెడ్డి శాంతి ఆరోపించారు. ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు పెట్టడం, సోషల్ మీడియా ద్వారా వ్యక్తిత్వ హననానికి పాల్పడటం తప్ప ప్రజలకు మెరుగైన పాలన అందించడంలో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

## జేఎన్‌టీయూ–జీవీ క్యాంపస్‌ను అత్యంత ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు కృషి

- నేడు జెఎన్‌టీయూ - జీవీ ప్రథమ స్నాతకోత్సవం
- వైస్-చాన్‌స్లర్ ప్రొఫెసర్ వి.వి. సుబ్బారావు

**విజయనగరం, జులై 10 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

జెఎన్‌టియు విజయనగరం క్యాంపస్‌ను అత్యంత ఆదర్శవంతంగా, అందంగా తీర్చి దిద్దేందుకు కృషి చేస్తున్నట్లు వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ వి.వి. సుబ్బారావు తెలిపారు. స్థానిక జెఎన్టీయు ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం - గురజాడ, విజయనగరం (జేఎన్‌టీయూ-జీవీ) ప్రథమ స్నాతకోత్సవాన్ని శనివారం విశాఖపట్నం లో ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. జులై 11న ఉదయం 11 గంటలకు విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం కన్వెన్షన్ సెంటర్‌లో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న విశ్వవిద్యాలయ ప్రథమ స్నాతకోత్సవంలో రాష్ట్ర గవర్నర్, యూనివర్సిటీ ఛాన్సలర్, గౌరవ ఎస్.అబ్దుల్ నజీర్ చేతులమీదుగా, యూనివర్సిటీ విద్యార్థులకు పట్టాల అందజేయడం జరుగుతుందని



తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మానవ వనరుల శాఖామంత్రి నారా లోకేష్, నిర్మాణ్ ఆర్గనైజేషన్ సిఈఓ మయూర్ పట్నాల తదితర ప్రముఖులు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొంటారని ఆయన చెప్పారు. 2023, 2024, 2025 సంవత్సరాల్లో ఉత్తీర్ణులైన సుమారు 34,896 మందికి ఈ కాన్వకేషన్‌లో పట్టాలను అందజేయడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. వీరిలో 32,177 మందికి డిగ్రీ, 2,708 మందికి పిజి, 11 మందికి పిహెచ్‌డి, 50 మందికి బంగారు పతకాలు, ఇద్దరికి ఎండోమెంట్ పథకాలు, 37 అఫ్లియేటెడ్ కాలేజీలు, ఇద్దరికి కాన్స్టియేంట్ కాలేజీలు, ఒకరికి గౌరవ డాక్టరేట్ అందజేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వివరించారు. అత్యంత వెనుకబడిన ప్రజలు నివసించే ఉత్తరాంధ్రలో అత్యున్నత సాంకేతిక విద్యను అందించి, సాంకేతికంగా అభివృద్ధి చేసేందుకు జెఎన్‌టియు పరంగా తమవంతు కృషి చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులకు భారం కాకూడదన్న ఉద్దేశంతో రూ.3వేల తత్కాల్ ఫీజును రద్దు చేశామన్నారు. వారి సౌకర్యార్థంగా వివిధ రకాల సేవలను, సర్టిఫికేట్లను ఆన్‌లైన్ ద్వారా అందిస్తున్నామని చెప్పారు. ఈ ప్రాంతంలోని యువతకు ఉపాధి కల్పించేలక్ష్యంతో, వారి పేర్లను నమోదు చేసుకొనేందుకు ఒక వెబ్ పోర్టల్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పేజీలో నమోదు చేసుకున్న వారికి రానున్న మూడేళ్లలో 3వేల ఉద్యోగాలను కల్పించాలన్నది తమ లక్ష్యంగా పేర్కొన్నారు. ఇప్పటికే తమ క్యాంపస్ ఎంఎస్ఎంఈ ఎక్స్‌టెన్షన్ సెంటర్‌గా ఎంపికయ్యిందని, నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇచ్చి, వారికి ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ఐటిఐ ఎలక్ట్రికల్ ట్రేడ్లో ఉత్తీర్ణులైన వారిలో 30 మందిని ఎంపిక చేశామని, వారికి జర్మన్ భాషలో శిక్షణ ఇచ్చి, త్వరలోనే జర్మనీలో ఉద్యోగాలు చేసేందుకు పంపిస్తామని చెప్పారు. ఆరోగ్యవంతమైన క్యాంపస్‌ను రూపొందించే లక్ష్యంతో వారానికోసారి సేవ్ ఎర్త్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలోనే తొలిసారిగా బ్లాక్ చైన్ టెక్నాలజీని ఉపయోగించి డిగ్రీ పట్టాలను రూపొందించామని విసి వివరించారు.

## 28న గురుపౌర్ణమి వేడుకలు

**విజయనగరం టౌన్, జులై 10 (మనసులో మాట) :**



ఈ నెల 28వ తేదీన జ్ఞాన భాస్కరం అనే పేరుతో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహిస్తున్నామని బాలక్ రామ్ మందిర్ ట్రస్ట్ అధ్యక్షులు కుసుమంచి సుబ్బారావు తెలిపారు. శుక్రవారం తన కార్యాలయంలో గోడపత్రికలను తెలుగు భాషా పరిరక్షణ సమితి అధ్యక్షులు సముద్రాల గురుప్రసాద్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కుసుమంచి సుబ్బారావు మాట్లాడుతూ సనాతన భారతీయ సంప్రదాయంలో గురువుకు ఎంతో ప్రాధన్యత ఉందని, గురువును ప్రతి ఒక్కరూ పూజించాలని కోరారు. గురుపౌర్ణమి వేడుకల సమన్వయకర్త గురుప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటలకు ప్రవచన వాచస్పతి స్వామి రామకృష్ణానంద ప్రవచనం ఉంటుందని, ఆ రోజున ప్రముఖ ఆధ్యాత్మిక వేత్తలు ఉపద్రష్ట వేంకట వరప్రసాద్, సుపథ రూపకర్త యు వి ఎ ఎన్ రాజు కూడా ప్రసంగిస్తారని తెలిపారు. సమావేశంలో నంది అవార్డు గ్రహీత ఈపు విజయ్ కుమార్, ఎం సత్యనారాయణమూర్తి, టి. సూర్యారావు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి





**విజయనగరం, జులై 10 (మనసులో మాట జిల్లా ప్రతినిధి)**

స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు తన కార్యాలయంలో శుక్రవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (ప్రజా దర్బార్) నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన మొత్తం 35 అర్జీలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అంతకు ముందు విజయనగరం మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా సంఘాల మహిళలకు స్వయం ఉపాధి అవకాశం కల్పించే ఉద్దేశంతో ఆధునిక రిటైల్ నమూనాతో పట్టణంలో పేర్లవారి జంక్షన్ (కన్యకా పరమేశ్వరి కోవెల దగ్గర) లో ఏర్పాటు చేసిన "రీచ్ మై స్టోర్" ను శాసనసభ్యురాలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతి రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రీచ్ మై స్టోర్ ప్రజా మన్ననలను పొందాలని ఆకాంక్షించారు.

## స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర: 25 కొత్త స్వచ్ఛ రథాలను ప్రారంభించిన ఎంపిపి

**కురుపాం జులై 10 (మనసులో మాట)**

పరిసరాల పరిశుభ్రత, పచ్చదనమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జియ్యమ్మవలస మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో శుక్రవారం 25 స్వచ్ఛ రథాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంను మండల అధ్యక్షుడు మరియు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొంగు సురేష్ జెండా ఊపి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భం



గా బొంగు సురేష్ మాట్లాడుతూ, మండలంలోని ప్రతి గ్రామాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఈ స్వచ్ఛ రథాలను అందుబాటులోకి తెచ్చామని తెలిపారు. ప్రజలంతా స్వచ్ఛ ఆంధ్ర నిర్మాణంలో భాగస్వాములు కావాలని, తడి, పొడి చెత్తను వేరుచేసి గ్రామాలను ఆరోగ్యవంతంగా ఉంచేందుకు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు దాసరి రామారావు నాయుడు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జోగి భుజంగరావు, ఇన్‌ఛార్జ్ ఎంపీడీఓ, మండల పరిషత్ సిబ్బంది, ఇతర ఉన్నతాధికారులు మరియు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధుల నివారణకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- మంత్రజోలలో వైద్య శిబిరం తనిఖీ చేసిన జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా. ఎస్. భాస్కరరావు.

**కురుపాం, జులై 10 (మనసులో మాట):**





మాదలింగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కురుపాం మండలం మంత్రజోల గ్రామంలో శుక్రవారం ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ ఎస్. భాస్కరరావు ఆకస్మికంగా సందర్శించి, పరిశీలించారు. శిబిరంలో రోగులకు అందుతున్న వైద్య సేవలు, మందుల పంపిణీ తీరును ఆయన సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. రోగులతో స్వయంగా మాట్లాడి వైద్య సేవలపై సంతృప్తిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ.. వర్షాకాలం దృష్ట్యా గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామంలో "లార్వా వేట" , డ్రైడే , సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. దోమల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నిల్వ నీరు లేకుండా చూసుకోవాలని గ్రామస్తులకు అవగాహన పరిచారు. జ్వర నిర్ధారణ పరీక్షలు, మందులు గ్రామంలో అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్.సి.డి ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్మోహనరావు, మాదలింగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ తనూజ, స్థానిక వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు మరియు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఓటరు జాబితా ధృవీకరణపై సమీక్ష : లాలం భరత్



**రాంబిల్లి జులై 10 మనసులో మాట**

రాంబిల్లి ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని టీడీపీ రాంబిల్లి మండల అధ్యక్షుడు లాలం భరత్ సూచించారు. శుక్రవారం రాంబిల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని 96, 97, 98, 99 పోలింగ్ బూత్‌లకు చెందిన బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు)తో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఓటరు జాబితా ధృవీకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో సమగ్రంగా చేపట్టి, అర్హులైన ప్రతి ఒక్కరి పేర్లు జాబితాలో ఉండేలా, అనర్హుల వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించాలని సూచించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాలను కచ్చితంగా అమలు చేయడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు చిట్టిబాబు, అజయ్, ఆనంద్, జనసేన నాయకుడు నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## ఫ్రై డే డ్రై డే తో దోమలు లార్వా లు మటుమాయం : సబ్ యూనిట్ ఆఫీసర్ శ్రీనివాసరావు

**శృంగవరపుకోట, జులై 10: (మనసులో మాట )**



కొత్తవలస మండలం వియ్యంపేట పరిధి లో గల గొల్లలపాలెం లో వైద్యాధికారి ఆదేశారు మేరకు ఇంటింటి ఫీవర్ సర్వేలెన్స్, కాలువలు, డ్రెయిన్లు , గోలెలు, కుండీలు లలో లార్వా లను ఎలిమినేట్ చేసి గ్రామస్తులకు మలేరియా, డెంగ్యూ, చికెన్ గునియా జ్వరాలు, లక్షణాలు,తీసుకోవలసిన జాగ్రత్తలు పై అవగాహన కల్పించినట్లు హెచ్. ఎస్. ఈశ్వరరావు తెలిపారు. అనంతరం గ్రామం లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి ఉచితంగా మందులు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎస్. ఈశ్వరరావు, పంచాయతీ సెక్రటరీ షేక్ సెహానాజ్,హెల్త్ అసిస్టెంట్ డి సత్యారావు,, ఎమ్, ఎల్. హెచ్. పి. ధనలక్ష్మి, ఏ. ఎన్. ఎమ్. సుగుణ, ఆశ వర్కర్ లక్ష్మి లు పాల్గొన్నారు.

## పంటలభీమా ప్రీమియం ఆగస్టు 15లోగా చెల్లించాలి : శ్యాం కుమార్

**గంట్యాడ, జులై 10 ( మనసులో మాట):**



గంట్యాడ మండలంలో వరి పంట భీమా కట్టుకునే ప్రతి రైతు ప్రధానమంత్రి ఫస్లీ బీమా యోజన పథకం కింద బీమా ప్రీమియం ను ఆగస్టు 15లోగా చెల్లించాలని, శుక్రవారం గంట్యాడలో మండల వ్యవసాయ అధికారి బి శ్యాం కుమార్ సూచించారు. ఎకరాకు 200 రూపాయలు వంతున ఆగస్టు 15లోగా చెల్లించి పంటల బీమాను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ ఏడాది నుంచి రైతులు సెల్ఫ్ డెకరేషన్ ఇస్తే సరిపోతుందన్నారు. డిక్లరేషన్ ఫారం లో భూమి వివరాలు, ఎంత సాగు చేస్తున్నారు, వరి పంట ఎంత వేశారు వంటి వివరాలు ఫారంలో నింపి రైతు ఇవ్వాలని చెప్పారు. ఈ క్రాప్ లో పంట వివరాలు తప్పనిసరిగా నమోదు చేసుకుని ఉండాలని చెప్పారు. రైతులు కనుక బ్యాంకులో రుణం తీసుకుని ఉంటే బ్యాంకు వారే పంటల బీమా ప్రీమియం చెల్లిస్తారని చెప్పారు. ఒకవేళ రైతులు బ్యాంకు రుణం తీసుకోనట్లయితే రైతులే పంటల బీమా ప్రీమియంగా ఎకరాకు 200 రూపాయలు వంతున చెల్లించాలని ఏవో శ్యామ్ కుమార్ సూచించారు

## తల్లిదండ్రులు తప్పనిసరిగా లీప్ యాప్‌ను వినియోగించాలి

- తమ పిల్లల విద్యా ప్రగతికి తల్లిదండ్రుల పర్యవేక్షణ కీలకం : ఎంఈఓ నరేష్

**నక్కపల్లి, జూలై 10 (మనసులో మాట) :**



తమ పిల్లల విద్యా ప్రగతిని ఎప్పటికప్పుడు తెలుసుకోవడానికి తల్లిదండ్రులు తప్పనిసరిగా లీప్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఎంఈఓ కె.నరేష్ సూచించారు. శుక్రవారం మండలంలోని పెద బోదిగల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల నిర్వహణ, విద్యార్థుల అభ్యాస స్థాయి, బోధన విధానంపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లీప్ యాప్ ద్వారా విద్యార్థుల రోజువారీ హాజరు, ఉపాధ్యాయుల బోధన తీరు, మధ్యాహ్న భోజన పథకం వివరాలు, విద్యా పురోగతి వంటి అంశాలను తల్లిదండ్రులు సులభంగా తెలుసుకోవచ్చన్నారు. పిల్లలు పాఠశాలలో ఎలా చదువుతున్నారు, ఏ స్థాయిలో ఉన్నారు, బోధన ఎలా సాగుతోంది వంటి సమాచారమంతా యాప్‌లో అందుబాటులో ఉంటుందని వివరించారు. తల్లి దండ్రులు లీప్ యాప్‌ను సద్వినియోగం చేసుకుని తమ పిల్లల చదువుపై నిరంతరం పర్యవేక్షణ ఉంచాలని, దీంతో విద్యార్థుల విద్యా నాణ్యత మరింత మెరుగు పడుతుందని ఎంఈఓ నరేష్ పేర్కొన్నారు.

## ఓటర్ల జాబితా డిజిటలైజేషన్ ప్రక్రియ మరింత వేగవంతం కావాలి

- కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్, అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్
- అధికారులతో ప్రత్యేక సమీక్ష

**పార్వతీపురం జిల్లా ప్రతినిధి , జూలై 10 మనసులో మాట :**



రాష్ట్రంలో విశిష్టమైన గుర్తింపు కలిగిన పార్వతీపురం మన్యం జిల్లాలో నిర్వహించే ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) 2026 ప్రక్రియ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలవాలని, ఆ దిశగా అధికారులంతా కలిసి కట్టుగా పని చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్, అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్ పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియలో భాగంగా ఫోటో ఓటర్ల జాబితా ముసాయిదా ప్రచురణకు కేవలం నాలుగు రోజులు మాత్రమే సమయం మిగిలి ఉందని వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఎన్నికల అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా వ్యవహరించాలని, ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పరిశీలనలో భాగంగా శుక్రవారం జిల్లాకు విచ్చేసిన వారు.. ముందుగా కలెక్టరేట్ మీటింగు హాలులో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. ఎన్.ప్రభాకరరెడ్డి, జాయింట్ కలెక్టర్ ఆర్.వైశాలి, డీఆర్వో కె.హేమలత, పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్, ఆర్.డీ.ఓ కె.మాధురి, జిల్లాలోని అన్ని నియోజక వర్గాల ఈఆర్వోలతో సమీక్షించారు. ముందుగా జిల్లాలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతి, ఇతర అంశాల గురించి వారు క్షుణ్ణంగా తెలుసుకున్నారు. ఈఎఫ్ (ఎన్యూమరేషన్ ఫారం) పత్రాల పంపిణీ, వాటిని వెనక్కి తీసుకోవటం, డిజిటలైజేషన్ ప్రక్రియ తదితర అంశాల గురించి నియోజకవర్గాల వారీగా ఆరా తీశారు. ఈ క్రమంలో జిల్లాలోని తాజా పరిస్థితిని, ఓటర్ల జాబితా సవరణకు తీసుకుంటున్న చర్యలను జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకరరెడ్డి కేంద్ర అధికారులకు వివరించారు.

**పారదర్శకతే ముఖ్యం: ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్**

ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్ మాట్లాడుతూ.. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఈఆర్వోలు అత్యంత కీలక పాత్ర పోషించాలని, ఏ నిర్ణయమైనా పారదర్శకంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ప్రతి చిన్న అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించాలని, జాగ్రత్తగా వ్యవహరించాలని చెప్పారు. అర్హత కలిగిన వారి ఒక్క ఓటు కూడా పోవడానికి వీల్లేదని, అదేవిధంగా అనర్హుల పేర్లు జాబితాలో ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఈఆర్వోలు తప్పకుండా తమ పరిధిలో ఉండే పోలింగ్ స్టేషన్లను సందర్శించాలన్నారు. తక్కువ ఫలితాలు లేదా తక్కువ ఓటర్ల నమోదు నమోదైన చోట క్షేత్రస్థాయి పర్యటన చేసి, దానికి గల కారణాలను విశ్లేషించుకోవాలని సూచించారు. ఆధార్ అనేది ఇతర కార్డుల తో పాటు ఒక గుర్తింపు కార్డు మాత్రమే అని, ఓటు హక్కుకు అది ఒక్కటే ప్రామాణికం కాదని స్పష్టం చేశారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియను సహేతుకంగా నిర్వహించి, నివేదికలను సకాలంలో సమర్పించాలని చెప్పారు.

## కోటబొమ్మాళి ఎం.పీ.డీవో ఫణీంద్ర కుమార్ కు పదోన్నతి

**టెక్కలి, జులై,10 (మనసులో మాట) :**



టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పనిచేస్తున్న కుప్పిలి ఫణీంద్ర కుమార్ కు పార్వతీపురం డి. డి. ఓ గా పదోన్నతి పై బదిలీ చేస్తూ తాజాగా ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు కార్యాలయ ఏ.వో కిల్లారి నారాయణరావు ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు శుక్రవారం విలేకరులకు వివరాలు అందజేశారు. గత కొన్నేళ్లుగా మండల అభివృద్ధి అధికారిగా పని చేస్తూ ఎవరిని నొప్పించకుండా అన్ని వర్గాలకు ఆయన సమన్యాయం చేస్తూ వచ్చారు., సిబ్బందిని సైతం సోదర భావంతో తనదైన శైలిలో కలుపుకుంటూ అందరితో ఆడుతూ పాడుతూ పని చేయించి అందరి మన్ననలు ఆయన పొందారు. ఆయన సేవలు కొనియాడదగినవి, ఫణీంద్ర కుమార్ పదోన్నతి పై వెళ్లడం ఒక ప్రక్క ఆనందదాయకమైన, అటువంటి అధికారి దూరమవడం మరో ప్రక్క బాధాకరమని తోటి అధికారులు, సిబ్బంది అభిప్రాయం వ్యక్తం చేశారు.

## పెండింగ్ పోర్టు పరిహారం ఇప్పించండి...బాధిత రైతు ఆవేదన

**టెక్కలి, జులై 10 (మనసులో మాట) :**



టెక్కలి నియోజకవర్గం సంతబొమ్మాళి మండలం మూలపేటలో పోర్టు నిర్మాణంతో భూములు కోల్పోయినా పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించకుండా జాప్యం చేస్తున్నారని పెండింగ్ పరిహారం ఇప్పించండి మహాప్రభు అంటూ బాధిత రైతు జీరు ధర్మారావు దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. సంతబొమ్మాళి మండలం నౌపడలో శుక్రవారం వీరు విలేకరుల ఎదుట తమ ఆవేదన వ్యక్తం చేశారు. తనకున్న ఎకరా 73 సెంట్లు భూమి పోర్ట్ నిర్మాణానికి ఇవ్వగా అందులో 80 సెంట్లు మాత్రమే 21లక్ష 50 వేల రూపాయలు పరిహారం ఇచ్చారని అన్నారు. మిగిలిన పరిహారం ఇవ్వకుండా ఏళ్లు తరబడి అధికారుల చుట్టూ తిప్పుతున్నారని అన్నారు. జిల్లా కలెక్టర్, ఆర్డీవో, తాహసిల్దార్ కు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా న్యాయం జరగలేదని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో పోర్టు నిర్మాణానికి నాతో పాటు మరో 31 మంది రైతులు భూములు ఇవ్వలేదని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పోర్టుకు భూములు ఇచ్చామని తెలిపారు. దీంతో ఎకరాకి అదనంగా ఇచ్చిన 12 లక్షల 50 వేల రూపాయలు కూడా నాకు ఇవ్వలేదని అన్నారు. కొబ్బరి ,జీడి చెట్లు పరిహారం కూడా ఇవ్వలేదని ఆరోపించారు. పరిహారం కోసం అడిగితే పోలీస్ కేసులంటూ బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ పరిహారం ఇప్పించాలని కోరుతున్నారు. మరోపక్క కె లింగుడు గ్రామంలో సర్వేనంబర్ 164/12,139/6లో మూడు ఎకరాల 51 సెంట్లకు పాస్ పుస్తకాలు కూడా రెవెన్యూ అధికారులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని తెలిపారు. దీనిపై ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

# అంగన్వాడీలు ధర్నా... రాస్తారోకో... మానవహారం...







- నలుపుచీరలతో నిరసన
- అంగన్వాడీ సెంటర్లు బంద్

**విజయనగరం, జులై 10 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలను మూసివేసి, నలుపు చీరలు కట్టుకుంటూ విజయనగరం కలెక్టరేట్ వద్ద తమ అపరిష్కృత సమస్యలను పరిష్కరించాలని ధర్నా నిర్వహించారు. అధికారులు స్పందించకపోవడంతో మానవహారం, రాస్తారోకో పెద్ద ఎత్తున నిర్వహించారు. అంగన్వాడీలు ఆందోళన పెరగడంతో ఐసీడీఎస్ పీడీ అక్కడకు చేరుకుని వారి వద్ద నుంచి వినతిపత్రం స్వీకరించారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు హామీ ఇవ్వడంతో పాటు స్థానిక సమస్యలు పరిష్కరించనున్నట్లు భరోసా కల్పించారు. శుక్రవారం అంగన్వాడీ కోర్కెల దినోత్సవం, ఐసిడిఎస్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు అయిన సందర్భంగా ఆల్ ఇండియా కమిటీ పిలుపుమేరకు విజయనగరం జిల్లా కలెక్టర్ ఆఫీస్ వద్ద జిల్లాలో ఉన్న అంగన్వాడీ కార్యకర్తలు మూకుమ్మడిగా ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కేఎం శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐసిడిఎస్ ఏర్పడి 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా అంగన్వాడీలను కార్మికులుగా గుర్తించి కనీస వేతనం 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోర్టులు తీర్పులిచ్చిన అమలు చేయకపోవడం సిగ్గుచేటని అన్నారు. అంగన్వాడీలకు కనీస వేతనంతో పాటు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని, పెండింగ్లో ఉన్న మినీ సెంటర్లు అన్నిటినీ మెయిన్స్ సెంటర్లుగా మార్చాలని కోరారు. సంక్షేమ పథకాలు అమలు చేయాలని, హెల్పర్లు ప్రమోషన్ విషయంలో ఐదు సంవత్సరాల సీనియారిటీ సంబంధించిన జీవో నెంబర్ ఐదును రద్దు చేయాలని, అంగన్వాడీలకు పని భారంగా ఉన్న నవ చేతన్ యాప్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న టిఏ బిల్లును ఇవ్వాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని, ముఖ్యంగా 42 రోజుల పాటు అంగన్వాడీల సమ్మె చేసిన సందర్భంగా 2024 జూలైలో జీతం పెంచుతామని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీ రమణ, అధ్యక్షులు కే సురేష్, అంగన్వాడి యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి లక్ష్మి, జిల్లా అధ్యక్షులు కే ప్రభావతి, ఉపాధ్యక్షులు పైడ్రాజు, తదితరులు పాల్గొన్నారు.

## రైతు పరిరక్షణ సమితి మండల అధ్యక్షుడిగా నానాజీ నియామకం

**మాడుగుల, జూలై 10 (మనసులో మాట)**



అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం, ఎం. కోటపాడు గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు గుమ్మాల సూర్య చంద్ర జోగారావును జాతీయ రైతు పరిరక్షణ సమితి అనకాపల్లి జిల్లా లో మాడుగుల మండలానికి అధ్యక్షుడిగా నియమించారు .ఈ మేరకు జాతీయ రైతు పరిరక్షణ సమితి, రాష్ట్ర కమిటీ చైర్మన్ మండలపు శ్రీనివాసరావు జిల్లా అధ్యక్షులు ఆడారి వరహాల కన్నారావు లు శుక్రవారం నియామక పత్రాన్ని అందజేసారు . రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి, రైతుల సమస్యల పరిష్కారం కోసం ఆయన చేస్తున్న సేవలను గుర్తించి ఈ బాధ్యతలను అప్పగించినట్లు సమితి నాయకులు తెలిపారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన గుమ్మాల సూర్య చంద్ర జోగారావు మాట్లాడుతూ, రైతుల హక్కుల పరిరక్షణ, ప్రభుత్వ పథకాలు ప్రతి రైతుకు చేరేలా కృషి చేస్తానని, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు.ఈ సందర్భంగా ఆయనకు గ్రామ పెద్దలు, రైతులు, స్నేహితులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేస్తూ, నూతన బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## అంగన్వాడీల వేతనాలు పెంచి సమస్యలు పరిష్కరించాలి: యూనియన్ నేతలు

**విశాఖపట్నం, మనసులోమాట , జులై 10:**





అంగన్వాడీలు వేతనాలు పెంచి, కనీస వేతనం చట్టం వర్తింపజేసి, సమస్యలను పరిష్కరించాలని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ డిమాండ్ చేశారు. అంగన్వాడీల కోరికల దినోత్సవం సందర్భంగా రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు)గౌరవ అధ్యక్షురాలు పి.మణి, అధ్యక్షురాలు ఎల్. దేవి, ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట లక్ష్మి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. కె.ఎస్.వి. కుమార్, కార్యవర్గ సభ్యులు బి. జగన్ ఆధ్వర్యంలో అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జగదాంబ జంక్షన్, సిఐటియు కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన చేపట్టారు. నిరసనలో అంగన్వాడి కార్యకర్తలు నల్ల వస్త్రాలు ధరించి, జగదాంబ జంక్షన్ వద్ద ప్రభుత్వానికి సాష్టాంగ నమస్కారం చేస్తూ సమస్యలు పరిష్కరించాలని వేడుకున్నారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు మాట్లాడుతూ గతంలో అంగన్వాడీ వేతనాల పెంపు కోసం 42 రోజుల పాటు జరిగిన సమ్మెకు అప్పటి ప్రతిపక్ష నేతలు, ప్రస్తుతం అధికారంలో ఉన్న ఎమ్మెల్యేలు, మంత్రులు మద్దతు తెలిపారని గుర్తు చేశారు. ఆ కూటమి నేతలు అధికారంలోకి వచ్చిన వెంటనే అంగన్వాడీల వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని ఇప్పటికీ అమలు చేయలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తయినా అంగన్వాడీ వేతనాలు పెంచకపోవడం బాధాకరం అని చెప్పారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించి, సామాజిక భద్రత కల్పించాలని కోరారు. నవచేతన యాప్ రద్దు చేసి, బిఎల్ఓ డ్యూటీల నుండి మినహాయింపు కల్పించాలన్నారు. పెండింగ్లో ఉన్న మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లగా అప్డేట్ చేయాలన్నారు. క్రొత్త అంగన్వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసి, పెండింగ్ బిల్లులు, ప్రయాణ చార్జీలు, ఇతర బకాయిలు వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నేతలతో పాటు అధిక సంఖ్యలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

## ఆనందపురం సీఐగా బాధ్యతలు తీసుకున్న ఎర్రం నాయుడు

**విశాఖపట్నం , జులై 10 , మనసులోమాట:**



ఆనందపురం సీఐగా వీవీసీఎం ఎర్రం నాయుడు శుక్రవారం ఉదయం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన సిహెచ్ వాసు నాయుడు గాజువాక బదిలీ కాగా, ఎర్రం నాయుడు టూటౌన్ నుంచి బదిలీ పై ఇక్కడికి వచ్చారు. పోలీస్ స్టేషన్ కు చేరుకున్న ఎర్రం నాయుడుకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. అనంతరం సీఐ వాసు నాయుడు నుంచి ఆయన బాధ్యతలు తీసుకొని, సీపీ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, డీసీపీ 1 మణికంఠ చందోలు, నార్త్ సబ్ డివిజన్ ఏసీపీ అప్పలరాజులను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ ఎర్రం నాయుడు మాట్లాడుతూ శాంతి భద్రతల విషయంలో రాజీలేకుండా పని చేస్తామన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ కు అధిక ప్రాధాన్యతను ఇస్తామని, ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉన్న నేరుగా పోలీసులను సంప్రదించవచ్చని సీఐ ఎర్రం నాయుడు తెలిపారు.

## వెంకటేశ్వరస్వామి ఆలయానికి భూమి విరాళం అందించిన రాంబాబు దంపతులు

**పాయకరావుపేట జులై 10 మనసులో మాట.**



సొంతూరు మీద ప్రేమతో విలువైన 54 సెంట్ల భూమిని గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి అప్పగించారు ఓ హైకోర్టు న్యాయవాది..పాయకరావుపేట నియోజకవర్గం పాల్తేరు గ్రామానికి చెందిన హైకోర్టు న్యాయవాది దేవవరపు రాంబాబు 54 సెంట్ల భూమిని తన తల్లి దండ్రులు దేవవరపు లోవరాజు, అప్పలరాజు జ్ఞాపకార్థం గ్రామంలోని వెంకటేశ్వర స్వామి ఆలయానికి విరాళంగా ఇచ్చారు.. ప్రముఖ అధ్యాపకులు బాబు శ్రీ మాస్టారు చేతులమీదుగా రాంబాబు ,మాధవి దంపతులు ఆలయ కమిటీకి శనివారం భూమి పత్రాలను అప్పగించారు.. రాంబాబు గతంలో గ్రామంలోని రామాలయానికి మరో 60 సెంట్ల భూమిని విరాళంగా ఇవ్వడం విశేషం.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు,పెద్దలు, గ్రామస్తులు,భక్తులు పాల్గొన్నారు.

## కురుపాం కేంద్రం లో బహిరంగ మరుగు దొడ్లు నిర్మించాలి

**కురుపాం జులై 10 (మనసులో మాట)**



కురుపాం మండల కేంద్రంలో ప్రతిరోజు వందలాది మంది ప్రజలు వేర్వేరు పనులపై వస్తూ ఉన్నా అందుబాటు లో బహిరంగ మరుగుదొడ్లు లేక ఇబ్బంది పడుతున్నారని బిజెపి మండల పార్టీ అధ్యక్షులు బోటు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి కు వినతి పత్రం అందించారు. ప్రతీ రోజు నిత్యవసర సరుకులు కొనుగోలుకు రాకపోకలు సాగిస్తుంటారని,గిరిజనులు పండించే పంటని కురుపాం గ్రామంలో విక్రయించడానికి వారపు సంతకు వస్తుంటారని. విద్యార్థులు, మహిళలు ప్రతిరోజు ప్రయాణిస్తుంటారని. మరుగుదొడ్లు లేక బహిరంగ ప్రదేశాల్లో కాలకృత్యాలు ఇబ్బందిగా మారి పారిశుద్ధ్య సమస్యలు తలెత్తు తున్నాయని అన్నారు. ప్రభుత్వ నిధులతో త్వరగా ఈ సమస్య కు పరిష్కారం చూడాలన్నారు. ముఖ్యంగా రావాడ రోడ్ జంక్షన్, మరియు వారపు సంత వద్ద మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉందని నీటి వసతి కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఓబిసి మోర్చా జిల్లా జనరల్ సెక్రెటరీ మద్ది దొరబాబు, ఓబీసీ మోర్చా జనరల్ సెక్రెటరీ గెంబలి ప్రదీప్ కుమార్, నెమలిపురి లక్ష్మణ్ పాల్గొన్నారు.

# రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ ఆధ్వర్యం గురు పూజోత్సవ వేడుకలు

**మునగపాక, జూలై 10, మనసులో మాట**



మునగపాక మండలం గణపర్తి సంఘ్ మండలి నందు శ్రీ ఆధి గురు వ్యాస మహర్షి జయంతి ఉత్సవాలు సందర్భంగా గురు పూజోత్సవ కార్య క్రమంను ఖండ సంపర్క ప్రముఖ్ కర్రి లక్ష్మి నారాయణ అధ్యక్షత న జరిగాయి. ఈ కార్యక్రమానికి వక్త గా ద్వారపు రెడ్డి.వాసు వచ్చి, గురు పూజొత్సవ వేడుకలు కోసం, ఆది గురు వ్యాస మహర్షి గొప్పతనం కోసం కొనియాడారు. సంఘటిత సమాజమే శక్తివంతమైన దేశానికి పునాది అని, సనాతన ధర్మానికి మనం అందరం కట్టుబడి ఉండాలి అని, హైందవ ధర్మాన్ని కాపాడు కోవలసిన అవసరం మన అందరికీ ఉందని శ్రీ వాసు తెలిపారు.. ఈ కార్యక్రమంలో గిన్నెవీర మహేశ్వర రావు, యల్లపు శ్రీను స్వామి, రామకృష్ణ స్వామి, కర్రి పవన్, మళ్ళ జగదీశ్, లోవ, దుంగ లక్ష్మణ, గంగాధర్, బీమునికన్న మరియు చూచుకొండ గణపర్తి గ్రామస్తులు , విద్యార్థులు పాల్గొన్నారు.

# అరబుపాలెంలో పారిశుధ్యం పట్ల అధికారులు శ్రద్ధ వహించాలి

- ఎంపీటీసీ సభ్యులు బొడ్డేడ బుజ్జి

**మునగపాక, జూలై 10, మనసులో మాట**



అరబు పాలెం గ్రామంలో సర్పంచుల పదవీకాలం ముగింపు కావడంతో గ్రామంలోని పారిశుధ్యం పట్ల అధికారులు ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలని, డ్రైనేజీలో చెత్త పేరుకుపోయిందని ఫలితంగా నీరు కాలువల ద్వారా వెళ్లడం లేదని, అలాగే వీధి దీపాలు చాలా వరకు గ్రామంలో వెలగటం లేదని అధికారులు ప్రత్యేకమైన శ్రద్ధ వహించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని ఎంపీటీసీ సభ్యులు బొడ్డేడ బుజ్జి అధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

# నిర్దేశిత గడువులోగా ఎన్యూమరేషన్ ప్రక్రియ పూర్తి చేయాలి

- మండలంలో 82 శాతం డిజిటలైజేషన్ పూర్తి : తహసిల్దార్ చిన్ని కృష్ణ

**నక్కపల్లి, జూలై 10 ( మనసులో మాట) :**



ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఎన్యూమరేషన్ ప్రక్రియ నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని తహసిల్దార్ బి. చిన్ని కృష్ణ ఆదేశించారు. మండలంలోని చిన దొడ్డిగల్లు గ్రామంలో చురుగ్గా సాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని శుక్రవారం తహసిల్దార్ చిన్ని కృష్ణ, వేంపాడు పీఏసీఎస్ చైర్ పర్సన్ వెలగా శ్రీనివాసరావులు పరిశీలించారు. ఈసందర్భంగా తహసిల్దార్ చిన్ని కృష్ణ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఎన్యుమరేషన్ ప్రక్రియ 82 శాతం పూర్తయింది అన్నారు. మండలంలో ఎన్యుమరేషన్ డిజిటలైజేషన్ నెల్లిపూడిలో అత్యధికంగాను, చినబోదిగల్లంలో అత్యల్పంగానూ జరిగిందన్నారు. చినదొడ్డిగల్లులో 84 శాతం పూర్తయింది అన్నారు. చైర్ పర్సన్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం విధించిన గడువు సమీపిస్తున్నందున ప్రజలు అప్రమత్తమై నిర్దేశిత గడువులోగా ఎన్యూమరేషన్ ఫారాలను బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. అలాగే బీఎల్‌వోలు కూడా ప్రజల నుంచి అందిన వివరాలను ఎప్పటికప్పుడు పరిశీలించి ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. గ్రామంలోని ఆరు పోలింగ్ స్టేషన్ల పరిధిలో ఎన్యూమరేషన్ కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోందని బీఎల్వోలు తెలిపారు.

# ఆధునిక పశుసంవర్ధక పద్ధతులను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

- లింగ నిర్ధారిత వీర్యం, పశువుల బీమాపై అవగాహన పెంచాలి
- జమ్ముపేటలో దేశావాళీ పశువుల ఫారాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి

**విజయనగరం, జులై 10 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**





పాడి రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకొని పశుసంవర్ధక రంగంలో అధిక ఆదాయం సాధించాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి సూచించారు. గుర్ల మండలంలోని జమ్ముపేట గ్రామానికి చెందిన కురిమినెల్లి శ్రీనివాసరావు నిర్వహిస్తున్న దేశావాళీ పశువుల ఫారాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ సందర్శించారు. ఫారంలో చెవి ట్యాగ్‌లు కలిగిన పశువులను పరిశీలించి, పశువుల గుర్తింపు, నిర్వహణ విధానాలపై వివరాలు తెలుసుకున్నారు. లింగ నిర్ధారిత వీర్యం ద్వారా జన్మించిన ఆడ దూడను పరిశీలించారు. ఈ సాంకేతికత ద్వారా ఆడ దూడలు పుట్టే అవకాశాల గురించి రైతును అడిగి తెలుసుకున్నారు. సుమారు 90 శాతం వరకు ఆడ దూడలే జన్మిస్తున్నాయని రైతు వివరించారు. దీనిపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ, ఆధునిక సాంకేతికతను విజయవంతంగా అమలు చేస్తున్న రైతును అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాల ఉత్పత్తి పెంపు, రైతుల ఆదాయ వృద్ధికి లింగ నిర్ధారిత వీర్యం వినియోగం ఎంతో ప్రయోజనకరమని అన్నారు. నాణ్యమైన జాతి అభివృద్ధితో పాటు పాల ఉత్పత్తి సామర్థ్యం పెరిగి పాడి పరిశ్రమ మరింత బలోపేతం అవుతుందని తెలిపారు. పశుసంవర్ధక శాఖ అధికారులు ఈ సాంకేతికతపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అనంతరం పశువుల బీమా అమలు గురించి ఆరా తీసిన కలెక్టర్, పశువులకు బీమా చేయించుకోవడం ద్వారా రైతులు అనుకోని నష్టాల నుంచి ఆర్థిక రక్షణ పొందవచ్చని తెలిపారు. ప్రతి పాడి రైతు పశువులకు తప్పనిసరిగా బీమా చేయించుకోవాలని సూచించారు. పాడి పరిశ్రమలో ఆధునిక సాంకేతికత, పశువుల ఆరోగ్య సంరక్షణ, బీమా వంటి అంశాలను సమర్థవంతంగా అమలు చేయడం ద్వారా రైతుల జీవనోపాధి మరింత మెరుగుపడుతుందని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి కె. చిట్టిబాబు, ఉద్యానశాఖ అధికారి ఎం. అనూష, వ్యవసాయ అధికారి లక్ష్మీనారాయణ, ఉద్యానశాఖ అధికారులు వి.హెచ్.ఏ. రామకృష్ణ, ఆయిల్ పామ్ సంస్థ ప్రతినిధులు, రైతు భరోసా కేంద్రం సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, పాల్గొన్నారు.

# కె.జె.పురం జంక్షన్‌లో రిక్వెస్ట్ బస్సు స్టాప్‌కు గ్రీన్ సిగ్నల్

- ప్రజల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించిన ఆర్టీసీ అధికారులు

**వి. మాడుగుల, జూలై 10/ (మనసులో మాట )**



మాడుగుల మండలం కస్పా జగన్నాధపురం (కె.జె.పురం) జంక్షన్‌లో రిక్వెస్ట్ బస్సు స్టాప్ ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామానికి చెందిన విశ్రాంతి ఉపాధ్యాయుడు రాపేటి రామకొండా రావు అనకాపల్లి ఆర్టీసీ డిపో ఇన్‌ఛార్జి మేనేజర్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు.ఈ వినతిపై స్పందించిన అనకాపల్లి ఆర్టీసీ అధికారులు, అనకాపల్లి డిపోకు చెందిన పల్లెవెలుగు బస్సులతో పాటు ఇతర డిపో బస్సులు కూడా కె.జె.పురం జంక్షన్ వద్ద ఆగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే ఈ ప్రతిపాదనను విశాఖపట్నం డిపో అధికారులకు కూడా పంపిస్తున్నట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా మాడుగుల నియోజకవర్గ ఎమ్మెల్యే గారి కుమారుడు బండారు అప్పలనాయుడు మాట్లాడుతూ, ఆర్టీసీ రీజినల్ మేనేజర్ తో మాట్లాడినట్లు, కె.జె.పురం జంక్షన్‌కు రిక్వెస్ట్ బస్సు స్టాప్ మంజూరు చేయడానికి అధికారులు సానుకూలంగా స్పందించారని తెలిపారు.

# సస్పెన్స్ నివేదికతో అధికారుల పదోన్నతులు నిలిచిపోయాయి

- జీవీఎంసీలోని అధికారుల తీరుపై అసంతృప్తి..

**విశాఖపట్నం, జూలై 10 , మనసులోమాట:**



జీవీఎంసీలోని కొందరు ఉద్యోగుల సస్పెన్స్‌పై నివేదిక అందిన పదోన్నతులు కల్పించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. అయితే అధికారులను ప్రసన్నం చేసుకుంటే వారిని ప్రమోషన్ల లిస్టులో చేర్చుతారని కొందరు జీవీఎంసీ ఉద్యోగులు అంటున్నారు. వేపగుంట జీవీఎంసీ జోన్ లో నలుగురు ఉద్యోగులపై ఇండ్ల పట్టాల పన్నులు అక్రమంగా వేశారని కౌన్సిల్ మీటింగ్లో ఓ కార్పొరేటర్ ప్రస్తావించగా అప్పటి మేయర్, కమిషనర్ ఆ నలుగురు ఉద్యోగులను సుమారు ఐదు సంవత్సరాల క్రితం సస్పెండ్ చేశారు. దీనిపై విచారణ అధికారిగా వాసు దేవ రెడ్డిని నియమించగా, 2021, అక్టోబర్-డిసెంబర్ నెల మధ్యలో నివేదికను ఆ అధికారి జీవీఎంసీ కమిషనర్ కి అందించారు. ఆరు నెలల నుండి ఏడాదిలోపు నివేదికను అనుసరించి క్రమశిక్షణ చర్యలను తీసుకోవలసి ఉంది. అయితే ఆ నివేదికను ఐదేళ్లుగా పక్కన పెట్టేసి, నలుగురు ఉద్యోగుల్లో ఒకరైన సూపర్‌డెంట్ ఎల్ సురేష్ కి మున్సిపల్ కమిషనర్ గా పోస్టింగ్ ఇవ్వడం విశేషం. ఈయనతో పాటు పదోన్నతి కల్పించాల్సిన ముగ్గురు ఉద్యోగులను నివేదిక రాలేదంటూ సాకు చెబుతూ పక్కన పెట్టేశారు. ముగ్గురు ఉద్యోగుల పదోన్నతి పెండింగ్ లో ఉందని అడిషనల్ ఆఫీసర్ పద్మజ, ఎడిసి జన్ సత్యవేణి చెబుతుండడం విశేషం. ఏసీబీ, విజిలెన్స్ కేసుల్లో ఉన్నవారికి సబ్జెక్ట్ టు కండిషన్ పై ప్రమోషన్లు ఇస్తున్నప్పుడు తమకు ఎందుకు ప్రమోషన్లు ఇవ్వడం లేదని వారు వాపోతున్నారు. అలా అయితే జ్ఞానాపురం జీవీఎంసీ జోన్ లో సుమారు 1200 ఇండ్ల పట్టాలకు సంబంధించి ఇంటి పన్నులు, పేర్లు బదిలీల ఫోర్జరీ జరిగింది. అప్పట్లో ఆ స్కాం జీవీఎంసీలో సంచలనం సృష్టించింది. ఈ స్కాములో 20 మంది ఉద్యోగులు ఉన్నారని అప్పట్లో పేర్లతో సహా బయటపడిన, వారిపై ఎటువంటి చర్యలు తీసుకోవడం గాని, విచారణ అధికారిని నియమించడం గాని నేటి వరకు జరగలేదు. అటువంటప్పుడు వేపగుంట జోన్ లో సస్పెన్షన్ కు గురై, పదోన్నతులు రాకుండా ఉన్న ఆ ముగ్గురు ఉద్యోగులు ఏ పాపం చేశారని వారి మీద అధికారులు వివక్షత చూపిస్తున్నారని కొందరు ఉద్యోగులు బాహాటంగానే కామెంట్స్ చేస్తున్నారు. ప్రస్తుత జీవీఎంసీ కమిషనర్ దృష్టి సారించి తమకు న్యాయం చేయాల్సిందిగా వారు అభ్యర్థిస్తున్నారు.

# విశాఖ ఉక్కు హోదాపై కాంగ్రెస్ హామీ : మాజీ కేంద్ర మంత్రి చింతామోహన్



**విశాఖపట్నం, జులై 10, మనసులోమాట:**

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఏపీకి ప్రత్యేక హోదా ఇచ్చి, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా ఆపుతామని మాజీ కేంద్ర మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చింతామోహన్ స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం దాబా గార్డెన్స్, ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ దళిత క్రైస్తవులు కాంగ్రెస్ పార్టీని వదిలి వెళ్లారని అందుకే వారికి బిజెపి పాలనలో కష్టాలు వచ్చాయని, తాము అధికారంలోకి వస్తే వారికి ఎస్సీ ఎస్టీ హోదా ఇస్తామని హామీ ఇచ్చారు. బిజెపి 12 ఏళ్ల పాలనలో కేంద్ర ప్రభుత్వ పనితీరును పనితీరుపై దుయ్యబట్టారు. 1992, డిసెంబర్ 6న బాబ్రీ మసీదును పడగొట్టి అయోధ్య రామాలయం నిర్మాణాన్ని కట్టి, రాముడు పేరు మీద వేలకోట్ల రూపాయలను బిజెపి అనుబంధ సంస్థల ప్రతినిధులు సేకరించారన్నారు. అయితే వారంతా రామాలయం పేరు మీద కోట్ల రూపాయల అవినీతి చేశారని, ఆస్ట్రేలియా పర్యటనలో ఉన్న ప్రధాన మంత్రి మోడీ రామాలయం విషయంపై సిబిఐ చేత, సుప్రీంకోర్టు పర్యవేక్షణలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. పాలిస్తీనా గాజాలో 20 వేల మందికి పైగా చిన్నారులను అమెరికా, ఇజ్రాయిల్ కలిసి దాడులు చేసి చంపేయడం ప్రపంచ చరిత్రలోనే దారుణం అని భారతీయ విదేశాంగ శాఖ, విదేశాంగ మంత్రులు, ప్రధాని మోడీ ఖండించకపోవడం దారుణం అన్నారు. నెహ్రూ, ఇందిరా, మన్మోహన్ సింగ్, పీవీ వంటి ప్రధాన మంత్రులు భారత దేశాన్ని ఉన్నత స్థానానికి తీసుకువెళ్లగా ప్రస్తుత బిజెపి పాలనలో దేశ పరిస్థితిని చూసి అందరూ నవ్వుకుంటున్నారని, చిన్నారులను చంపేస్తే ప్రశ్నించలేని స్థితిలో ఉన్నారన్నారు . యుద్ధం ప్రారంభానికి ముందు ప్రధాని మోడీ ఎందుకు ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యహును కలిశారో చెప్పాలని డిమాండ్ చేశారు. భారత విదేశాంగ దీనిపై మాట్లాడకపోవడానికి కారణం, ప్రధాని మిత్రుడు ఆదానీ అమెరికాలో కేసులలో ఇరుక్కుపోవడమే అని తెలిపారు. బైడన్ అమెరికా ప్రెసిడెంట్ గా ఉన్నప్పుడు ఆదానీ లంచగొండి వ్యవహారాన్ని ఒప్పుకోలేదని గుర్తు చేశారు. తన మిత్రుడు ఆదానీ కోసం దేశాన్ని అమెరికా ముందు ప్రధాని మోడీ తాకట్టు పెడుతున్నారని విమర్శించారు. విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనేది కాంగ్రెస్ తీసుకువచ్చిందే అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేస్తూ ఉంటే చంద్రబాబు నాయుడు కేంద్రంతో మాట్లాడకపోవడం అన్యాయం అన్నారు. ప్రస్తుతం ఏపీ ఆర్థిక సంక్షోభం లో ఉందని, ప్రత్యేక హోదా అవసరమని, దానిని సాధించడంలో జగన్మోహన్ రెడ్డి, చంద్రబాబునాయుడు విఫలమయ్యారని విమర్శించారు. 19 ఏళ్లు పూర్తి చేయనున్న ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ఏం సాధించారో చెప్పాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు అమ్మకాన్ని ఆపలేక పోవడమే కాకుండా, తిరుపతికి చెందిన నాలుగువేల ఎకరాలను ఆదానీ కొట్టేస్తుంటే చంద్రబాబు మౌనంగా ఉన్నాడని మండి పడ్డారు . బిజెపితో పొత్తు పెట్టుకుని ఏమి సాధించారో చంద్రబాబు చెప్పాలన్నారు. ఆదాయానికి మించిన ఆస్తులు కూడా పెట్టడంతో జయలలితను ఆనాడు అరెస్టు చేశారని, అదే ఆస్తుల కేసులో జగన్ విషయంలో పదహారేళ్లుగా పరిశీలిస్తున్నామని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కోర్టులకు, ఇతర శాఖల విషయంలో మోడీ, అమిత్ షాల ఆమోద ముద్ర వేయాల్సిన పరిస్థితి నేడు దాపురించిందన్నారు. ప్రజల్లో మార్పు వచ్చిందని నేడు కాంగ్రెస్ పార్టీని ప్రజలు కోరుకుంటున్నారని ఆనందం వ్యక్తం చేశారు. 75 సంవత్సరాల స్వాతంత్ర పాలనలో ఒక్క ఓబీసీ నేత ముఖ్యమంత్రి కాలేదన్నారు. తమ పార్టీ అధికారంలోకొస్తే కాపు నేతను ముఖ్యమంత్రి చేస్తామని స్పష్టం చేశారు. ప్రశ్నించే విమర్శించే వారిపై కేసులు పెట్టడం సరికాదని, ఆనాడు పివి ప్రధానిగా ఉన్నప్పుడు విమర్శలను ఆహ్వానించే వారని, అది నేడు కరువైందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజాప్రశ్న రావణను అరెస్టు చేసి కేసులు పెట్టడం భావ ప్రకటన స్వేచ్ఛను హరించడమే అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నేతలు గార సూర్యారావు, గుత్తుల శ్రీనివాసు, కాంగ్రెస్ మైనార్టీ నేత అబీదా, తదితరులు పాల్గొన్నారు.

# డిజిటలైజేషన్ కార్యక్రమాన్ని పరిశీలించిన ఎంపీడీవో



**కోటవురట్ల మనసులో మాట జులై10:**

సర్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని ఎంపీడీవో చంద్రశేఖర్ ఆదేశించారు. శుక్రవారం జల్లూరు సచివాలయంలో సర్ కార్యక్రమానికి సంబంధించి డిజిటలైజేషన్ ప్రక్రియను పరిశీలించారు. ప్రజలు పూర్తిచేసి ఇచ్చిన ఎన్యూమరేషన్ ఫారాలను వెంటనే డిజిటలైజేషన్ చేయాలన్నారు. ఇప్పటివరకు మండలంలో 90 శాతం వరకు సర్ సర్వే పూర్తయిందని పేర్కొన్నారు. బీఎల్ఓ ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు చేపట్టాలన్నారు. అర్హులైన వారిని ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. కార్యక్రమం మొత్తం పారదర్శకంగా జరగాలన్నారు. ఎటువంటి పొరపాట్లు, తప్పులకు ఆస్కారం లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి రఘురాం పాల్గొన్నారు.

# ఉద్దండపురం జంక్షన్‌లో ఘోర రోడ్డు ప్రమాదం...నలుగురికి గాయాలు



**నక్కపల్లి జులై 10 (మనసులో మాట) :**

మండలంలోని ఉద్దండపురం జంక్షన్ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాయపడగా మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. శుక్రవారం జరిగిన ప్రమాదానికి సంబంధించి సీఐ జె. మురళి తెలిపిన వివరాల ప్రకారం పలాస నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఐచర్ వ్యాన్ ఉద్దండ పురం జంక్షన్ లో కూరగాయల లోడ్‌తో యూటర్న్ తీసుకుంటున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో పక్కనే ఉన్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టడంతో పాటు అదే సమయంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తున్న కూరందాసు లోవయ్యను ఢీ కొట్టి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కూరందాసు లోవయ్య తీవ్రంగా గాయపడగా మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నంలోని కేజీహెచ్‌కు తరలించారు. ద్విచక్ర వాహనంపై ఉన్న ఇద్దరు వ్యక్తులు ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కాగా వారిని తునిలోని మమత ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జె. మురళి చెప్పారు.

# పారిశ్రామిక వేత్తలుగా విశ్రాంత ఉద్యోగులు

- డిఐఈపిసి సమావేశంలో కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి



**విజయనగరం, జులై 10 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

జిల్లాలోని నిరుద్యోగ యువతతోపాటు, విశ్రాంత ఉద్యోగులను సైతం ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలని, వారికి అన్ని విధాలా ప్రోత్సాహాన్ని అందించి పరిశ్రమలను స్థాపించేవిధంగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి కోరారు. ఉద్యోగ విరమణ చేసిన విశ్రాంత ఉద్యోగులకు ఆర్థికంగా వెసులుబాటు ఉంటుందని, అందువల్ల వారి పెట్టుబడులను పారిశ్రామిక రంగంవైపు మరల్చాలని సూచించారు. చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు, ఎంబిఏ విద్యార్థులకు పరిశ్రమల స్థాపనపై అవగాహన కల్పించి, వారు పరిశ్రమల స్థాపనకు ముందుకు వచ్చేట్టుగా చైతన్య పరచాలని కోరారు. జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ (డిఐఈపిసి), ఎస్ఐపిబి (ఇన్వెస్ట్‌మెంట్ ట్రాకర్), ఎంఓయుల సమావేశాలు ఆన్‌లైన్ ద్వారా శుక్రవారం జరిగాయి. జిల్లాలో కొత్తగా పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు వచ్చే వారికి జిల్లా యంత్రాంగం తరపున అన్నివిధాలా సంపూర్ణ సహకారం అందించి, వీలైనంత వేగంగా పరిశ్రమలను స్థాపించే విధంగా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమల స్థాపనకు వచ్చిన దరఖాస్తులు, ఎంఓయుల స్థితిగతులపై చర్చించారు. సింగిల్ డెస్క్ విధానం క్రింద నిర్ణీత కాలవ్యవధిలోగా పరిశ్రమలకు అనుమతులు ఇవ్వాలని చెప్పారు. మా మహామాయ, రాధిక వెజిటబుల్ ఆయిల్స్, జెఎస్‌డబ్ల్యూ పార్క్, స్టీల్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా, బెర్రీ ఎల్లాయిస్, సూపర్ స్మెల్టర్స్ తదితర కంపెనీల స్థాపనకు, విస్తరణకు అవసరమైన భూసేకరణ, ఇతర సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. కెవిఐసి 2.0పై అవగాహన కల్పించేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ సమావేశంలో పరిశ్రమలశాఖ జిఎం ఎంవి కరుణాకర్, ఏపిఐఐసి జెడ్ఎం కృష్ణప్రసాద్, ఏపిఈపిడిసిఎల్ ఎస్ఈ ఎం.లక్ష్మణరావు, ఆర్డిఓలు, వివిధ శాఖల అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.

# తండ్రి, సవతి తల్లిని హత్య చేసిన కేసులో కొడుకుకు జీవిత ఖైదు

- ఎస్పీ ఎ.ఆర్.దామోదర్



**విజయనగరం, జులై 10 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

విజయనగరం జిల్లా బొండపల్లి పోలీసు స్టేషనులో 2024 సం.లో నమోదైన హత్య కేసులో నిందితుడు బొండపల్లి ఎస్.సి.కాలనీకి చెందిన దోల లక్ష్మణరావు (23)కు జీవిత ఖైదు, రూ. 2000/ జరిమానా విధిస్తూ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం.బబిత తీర్పు వెల్లడించినట్లుగా శుక్రవారం ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. బొండపల్లి ఎస్.సి.కాలనీకి చెందిన నిందితుడు దోల లక్ష్మణరావు (23) తల్లి తన చిన్నతనంలోనే చనిపోగా అతని తండ్రి మరో పెళ్లి చేసుకున్నాడన్నారు. నిందితుడు తన సవతి తల్లి, తండ్రితో కలిసి నివాసం ఉండేవాడన్నారు. ప్రతి రోజూ సవతి తల్లి, తండ్రి నిందితుడిని ఎందుకు పనికిరాడని, ఇంట్లో నుండి వెళ్ళిపొమ్మని హేళనచేసేవారన్నారు. దీన్ని భరించలేని నిందితుడు దోల లక్ష్మణరావు 23.02.2024న ఉదయం ఇంటివద్దనే కత్తితో తల్లితండ్రులను పొడిచి చంపేసాడన్నారు. ఈ విషయమై బొండపల్లి, విఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి గజపతినగరం ఎస్ఐ కే.లక్ష్మణరావు కేసు నమోదు చేయగా, అప్పటి గజపతినగరం సిఐ ఎస్.వి.ప్రభాకరరావు విచారణ చేపట్టి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించి, సమర్థవంతంగా దర్యాప్తు పూర్తి చేసారన్నారు. అనంతరం సిఐ జి.ఎ.వి.రమణ నిందితుడిపై న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు. కేసులో ప్రాసిక్యూషను విజయవంతంగా పూర్తి చేసి, న్యాయస్థానంలో సాక్ష్యాలను ప్రవేశ పెట్టడం, నేరం రుజువుకావడంతో నిందితుడు దోల లక్ష్మణరావుకు శిక్ష పడినట్లు ఎస్పీ తెలిపారు.

# హౌస్ ఓల్డ్ సర్వేలో "స్క్రిప్టింగ్ ఆప్షన్" ఇవ్వాలి



**టెక్కలి, జులై 10 (మనసులో మాట) :**

ఇటీవలే ప్రభుత్వం నిర్వహించిన హౌస్ హోల్డ్ సర్వే అనంతరం ఇవ్వవలసిన "స్క్రిప్టింగ్ ఆప్షన్" ఇంతవరకు ఇవ్వకపోవడంతో అనేకమంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ముఖ్యంగా కొత్తగా వివాహాలు చేసుకున్న వారికి రేషన్ కార్డు పొందేందుకు, పాత రేషన్ కార్డ్ నుంచి తొలగేందుకు రిలేషన్ ఆప్షన్ ఇవ్వవలసి ఉంది. అలాగే గత వైసిపి పాలనలో "ఇన్కమ్ టాక్స్" పేరుతో అర్హులైన అనేకమంది ప్రభుత్వ పథకాలు అందకుండా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాల్లో వారి పిల్లలు ప్రైవేట్ సెక్టార్లలో పనిచేసినా వారి తల్లిదండ్రులకు ఇక్కడ పథకాలు నిలిపివేశారు. గతంలో వాలంటీర్లు చేసిన అనేక పొరపాట్లు వలన అర్హులైన వారు అప్పటినుంచి ప్రభుత్వ పథకాలను కోల్పోయారు. ప్రభుత్వం మారితే మళ్లీ మా పథకాలు, మా పెన్షన్లు మాకు వస్తాయని ఆశించిన అనేకమంది ఆశలు అడియాసలు అవుతున్నాయి. ప్రభుత్వం మారి రెండేళ్లు గడుస్తున్న ఎక్కడి వేసిన గొంగళి అక్కడే అన్న చందాన వ్యవస్థలు ఉండిపోయాయి. అలాగే అనేకమంది ఆధార్ కార్డు నెంబర్లు వేరొకరి ఆధార్ కార్డుకు అనుసంధానం అయిపోవడంతో ఆ ఇరువురిలో ఒకరు పథకాలకు దూరమవుతున్నారు. ఇటువంటి సమస్యలన్నీ పరిష్కారం కావాలంటే హౌస్ హోల్డ్ స్క్రిప్టింగ్ ఆప్షన్, డిలేషన్ ఆప్షన్ కచ్చితంగా ఇవ్వాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు , ప్రజా ప్రతినిధులు స్పందించి అర్హులకు న్యాయం చేయాలని సర్వత్రా కోరుతున్నారు.

# మా సమస్యల పరిష్కరించండి.. సిఐటియు

**పార్వతీపురం జూలై 10 మనసులో మాట:**

అంగన్వాడీలకోర్కుల దినం సందర్భంగా పార్వతిపురం లో భారీ ర్యాలీ అంగన్వాడీల జీతాలు పెంచాలని సమస్యలు పరిష్కారం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లాలో కథము తొక్కిన అంగన్వాడీ ఆర్టీసీ కాంప్లెక్స్ నుండి కలెక్టరేట్ వరకు ర్యాలీ చేసి అనంతరం మహా ధర్నా నిర్వహించారు. అంగన్వాడీలకు వేతనాలు పెంచాలి నవ చేతన యాప్ రద్దు చేయాలని బి ఎల్ ఓ డ్యూటీలు మినహాయించాలని పెండింగ్ ఉన్న మినీలను మెయిన్ గా మార్చాలని ఇతర సమస్యలు పరిష్కర చెయ్యాలి ఈ సందర్భంగా ధర్నా దగ్గరకు వచ్చిన డిఆర్ఓ కె హేమలత గారికి సమస్యలతో కూడిన వినతి పత్రం ఇచ్చారు

ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షులు అమర వేణి అధ్యక్షతన జరిగిన ధర్నాలో నాయకులు ఎం ఉమామహేశ్వరి,గంట జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ అంగన్



వాడి వర్కర్లకు హెల్పర్లకు మినీ వర్కర్లకు 2019 నుండి వేతనాలు పెరగలేదు ఈ కాలంలో నిత్యవసర వస్తు ధరలు విపరీతంగా పెరిగాయి అంగనవాడీలకు రకరకాల యాప్లు తెచ్చి పని భారం పెంచారు ఈ కాలంలో వేతనాలు పెంచాలని చేసిన పోరాటాల ఫలితంగా 2024లో వేతనాలు పెంచుతామని మినిట్స్ కాపీ ఇచ్చారు దాని గురించి కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు. 2026 మార్చి 2 తేదీ బడ్జెట్ సమావేశాల సందర్భంగా అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని ఇతర సమస్యల పరిష్కారం చేయాలని చేసిన ఆందోళన ఫలితంగా మార్చి 10వ తారీఖున ఐసిడిఎస్ మంత్రి ముఖ్యమంత్రి తో మాట్లాడి త్వరలో వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు. కానీ నేటికీ హామీ అమలు కాలేదు.మిగిలిన మినీ సెంటర్లోని మెయిన్ సెంట్రల్ గా మార్చాలని అంగన్వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని రాజకీయ వేధింపులు ఆపాలని కోరారు కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు

దవాల రమణారావు ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, గొర్లి వెంకటరమణ బి వెంకటరమణ జి వెంకటరమణ బి సూరిబాబు పాల్గొన్నారు ఈ ధర్నాకి ఐద్వా జిల్లా కార్యదర్శి బి లక్ష్మి మద్దతు తెలియజేశారు , కోరాడ ఈశ్వరరావు, ప్రాజెక్టుల నాయకులు, వి రామలక్ష్మి, సరళ,సరోజ, దాలమ్మ, పార్వతి, పార్వతి దేవి, గౌరమ్మ,దాలమ్మ, గౌరీ మణి, , తదితర అంగన్వాడీలు పాల్గొన్నారు

# జిల్లా పోలీసుశాఖలో భారీగా బదిలీలు

**విజయనగరం, జులై 10 (మనసులో మాట జిల్లా ప్రతినిధి) :**

జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్ల పరిధిలో వివిధ హోదాల్లో పని చేస్తూ, ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళను శుక్రవారం బదిలీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ మాట్లాడుతూ బదిలీ ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించేందుకు ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న ఎఎస్ఐ, హెడ్ కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళ ప్రతి ఒక్కరి నుండి అయిదు పోలీస్ స్టేషనులను ఎంచుకొనే అవకాశం కల్పించి ఏర్పడిన ఖాళీలను



బట్టి సిబ్బందికి అందులో ఒక పోలీస్ స్టేషనుకు బదిలీ చేయడం జరిగిందని తెలిపారు. ఐదు సంవత్సరాలు పూర్తి చేసుకున్న పోలీసు సిబ్బంది వారు కోరుకున్న స్థానానికి పారదర్శకంగా బదిలీలను చేపట్టామని అన్నారు. 19 మంది ఎఎస్ఐలు, 42 హెడ్ కానిస్టేబుళ్ళు, 61 మంది కానిస్టేబుళ్ళకు జిల్లా ఎస్పీ వివిధ పోలీసు స్టేషన్లుకు బదిలీలు చేస్తూ, ఉత్తర్వులు జారీ చేసారు. ఎటువంటి సిఫార్సులకు తావు లేకుండా క్రింది స్థాయి సిబ్బంది కోరుకున్న స్థానానికి జిల్లాఎస్పీ బదిలీలు చేపట్టడంతో పోలీసు సిబ్బంది తమ ఆనందాన్ని వ్యక్తం చేసారు. ఈ బదిలీల ప్రక్రియలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎఓ పి.శ్రీనివాసరావు, ఎస్బీ సిఐ ఎ.వి. లీలారావు, జూనియర్ సహాయకురాలు చాముండేశ్వరి పాల్గొన్నారు.

# నాగులపల్లి హైస్కూల్లో అబ్దుల్ కలాం విగ్రహ ఆవిష్కరణ





- **విగ్రహ ఆవిష్కరణ చేసిన సుందరపు వెంకట సతీష్ కుమార్**

**మునగపాక, జులై 10, మనసులో మాట**

ఎలమంచిలి నియోజకవర్గ మునగపాక మండలం నాగులపల్లి గ్రామంలోజిల్లా పరిషత్ హైస్కూల్లో ఆవరణంలో అనకాపల్లి జిల్లా అబ్దుల్ కలాం సేవా సంఘం వ్యవస్థాపక చైర్మన్ ఆళ్ళ ప్రవీణ్ కుమార్ ఆధ్వర్యంలో మిస్సైల్ మెన్ ఆఫ్ ఇండియా డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం 11,వ వర్ధంతి సందర్భంగా ముఖ్యఅతిథి ఉత్తరాంధ్ర జనసేన పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ సుందరపు వెంకట సతీష్ కుమార్ చేతుల మీదగా అబ్దుల్ కలాం విగ్రహ ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ అబ్దుల్ కలాం రాష్ట్రపతిగా దేశానికి అందించిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దొడ్డి శ్రీనివాసరావు, పిఎసిఎస్ పర్సన్ఇన్చార్జ్ ఎల్లపు వెంకట భాస్కరరావు,స్కూల్ కమిటీ చైర్మన్ పొలమర శెట్టి మురళి నూకాలయ్య,జనసేన మండల పార్టీ అధ్యక్షులు టెక్కలి పరశురాం,సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు దాడి ముసలి నాయుడు, అనకాపల్లి ఆవకాలవ చైర్మన్ ఆడారి ఆనంద్ సన్యాసినాయుడు, గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ జామి చిన్నమ్మలు, మాజీ ఉపసర్పంచ్ గోసాల గోవిందరాజు,కుర్రి సరోజినీ, ఆడారి గణేష్, మొల్లేటి ఆనంద్, కాళ్ళ చంద్రమోహన్, సాలాపు మురళి,మోటూరు శ్రీ వేణి, చుక్క అనురాధ, సుందరపు ధనలక్ష్మి, కొయ్య రమణ,ఆడారి భాస్కరరావు, పల్లా సన్యాసిరావు తదుతరి కూటమి నాయకులు పాల్గొన్నారు.

# కన్వేయర్ బెల్ట్ ద్వారా వ్యాపిస్తున్న లోహ ధూళిని నియంత్రించాలి..

- **ప్రజల ఆరోగ్యాన్ని రక్షించాలని అధికారికి వినతిపత్రం**

**విశాఖపట్నం, జులై 10 , మనసులోమాట:**

స్టీల్ ప్లాంట్ నుండి పోర్టు వరకు ఉన్న కన్వేయర్ బెల్ట్, ఖనిజాల నిల్వ యార్డులు, పోర్టు కార్యకలాపాల వల్ల వ్యాపిస్తున్న లోహ ధూళి కాలుష్యాన్ని నియంత్రించి విద్యార్థులు, ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు తక్షణ చర్యలు తీసుకోవాలని పిడిఎస్ఓ ఆధ్వర్యంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రాంతీయ కాలుష్య నియంత్రణా అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శుక్రవారం పిడిఎస్ఓ జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ నుండి పోర్టు వరకు ఏర్పాటు చేసిన కన్వేయర్ బెల్ట్ ద్వారా ఇనుము, అల్యూమినియం మొదలగు ఖనిజాల రవాణా జరుగుతోందన్నారు. ఈ కన్వేయర్ బెల్ట్ పనిచేసే సమయంలో సూక్ష్మ



లోహ ధూళి పెద్ద మొత్తంలో కిందకు వెలువడుతూ కాలుష్యాన్ని సృష్టిస్తుందన్నారు. పాత పోస్ట్ ఆఫీస్ ప్రాంతంలో ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల భవనం మీదుగా ఈ కన్వేయర్ బెల్ట్ వెళ్లడం వలన ప్రతిరోజూ వేలాది మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానిక ప్రజలు ఈ కాలుష్యానికి గురవుతున్నారని చెప్పారు.

అదే విధంగా, విశాఖ పోర్టు ప్రాంతంలో బొగ్గు, ఇనుప ఖనిజం, బాక్సైట్ మరియు ఇతర ఖనిజాల దిగుమతి, ఎగుమతి కార్యకలాపాల సందర్భంగా లారీల ద్వారా రవాణా, కన్వేయర్ బెల్ట్ ద్వారా తరలింపు, నౌకల నుండి దింపడం, నౌకల్లోకి ఎక్కించడం, బహిరంగ ప్రదేశాల్లో నిల్వ చేయడం వంటి ప్రక్రియలలో తగిన దుమ్ము నియంత్రణ చర్యలు అన్ని వేళలా సమర్థవంతంగా అమలు కాకపోవడం వలన సూక్ష్మ ధూళి కణాలు వ్యాపించి పిల్లల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు పడే అవకాశం ఎక్కువగా ఉందని వెల్లడించారు. దీర్ఘకాలం ఇటువంటి ధూళికి గురికావడం వల్ల శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు, అలర్జీలు, ఆస్తమా తీవ్రత పెరగడం, ఇతర శ్వాసకోశ సమస్యలు వస్తున్నాయన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, వారి భవిష్యత్తు, ప్రజల జీవన ప్రమాణాలను దృష్టిలో ఉంచుకుని పై అంశాలపై అత్యవసరంగా చర్యలు తీసుకొని కాలుష్యాన్ని నియంత్రించాలని ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ముకుందరావును కోరగా కాలుష్య నివారణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పిడిఎస్ఓ జిల్లా సహాయ కార్యదర్శి జానకి, రఘు, లక్ష్మణ్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

# సర్ గడువు ముగుస్తోంది.. వెంటనే ఓటు వెరిఫికేషన్ పూర్తి చేసుకోండి

- అడుగులపుట్టు పంచాయతీలో విస్తృత పర్యటన..
- ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు
- రాష్ట్ర గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్....





**పెదబయలు జూలై 10 మనసులో మాట :**

అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గం పెదబయలు మండలం అడుగులపుట్టు పంచాయతీలో రాష్ట్ర గిరిజన సహకార సంస్థ (జీసీసీ) చైర్మన్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి కిడారి శ్రావణ్ కుమార్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో సమావేశమై, ప్రస్తుతం కొనసాగుతున్న సర్ (ఓటరు జాబితా ప్రత్యేక సవరణ) ప్రక్రియ గడువు సమీపిస్తున్నందున ప్రతి ఒక్కరూ తమ ఓటు వివరాలను వెంటనే వెరిఫికేషన్ చేసుకుని, అవసరమైన మార్పులు చేర్పులు పూర్తి చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం గ్రామస్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అడుగులపుట్టు పంచాయతీలో డీఆర్ డిపో ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరగా, సంబంధిత అధికారులతో మాట్లాడి డిపో ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రం భవనం, పాఠశాల భవనం మరమ్మతులు, వాటర్ ట్యాంక్ మరమ్మతులు వంటి సమస్యలను పరిశీలించి, సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

రైతు భరోసా పథకం అందని రైతుల సమస్యలను అక్కడికక్కడే వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని సూచించారు. అదేవిధంగా 'తల్లికి వందనం' పథకంలో ఇద్దరు పిల్లలకు లబ్ధి అందగా, మొదటి తరగతి చదువుతున్న మూడో చిన్నారికి లబ్ధి అందలేదని గ్రామస్థులు తెలియజేయడంతో, వెంటనే ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి తో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిశీలించి అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని, సంబంధిత అధికారులతో సమన్వయం చేస్తూ వాటి పరిష్కారానికి కృషి చేయడం తన బాధ్యత అని కిడారి శ్రావణ్ కుమార్ తెలిపారు. కూటమి ప్రభుత్వం గిరిజన ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు.

# సార్ సర్వే పక్రియ వేగవంతం చేయాలి

- మూడుసచివాలయాలకు విస్తృత పర్యటన
- రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షులు రేగం చాణక్యరావు



**అనంతగిరి,జులై 10 మనసులో మాట**

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం జీనపాడు పినకోట పెద్దకోట కవర్ల గ్రామ పంచాయతీలకు శుక్రవారం ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (సార్) సర్వే నిర్వహణపై అనంతగిరి మండలంలో పలు సచివాలయాలకు పర్యటించిన రాష్ట్ర యువజన విభాగ అధ్యక్షులు రేగం చాణిక్యరావు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో గిరిజనులకు ఓటరు సర్వేపై గిరిజనుల్లో ఉన్న అపోహలు, సందేహాలను నివృత్తి చేస్తూ, బి ఎల్ ఓ సచివాలయ సిబ్బందిని సహకరించాలని ప్రతి అర్హత కలిగిన ఓటరు సర్వేలో తప్పనిసరిగా పాల్గొని అవసరమైన వివరాలను అందించాలని సూచించారు. శాశ్వత మైగ్రేషన్ ఉన్న కుటుంబాలను ఓటారు జాబితా నుండి తొలగించి 18 సంవత్సరాలు వయో పరిమితి కలిగి ఉన్న యువతి యువకులను కొత్తగా ఓటరు జాబితాలో చేర్పించాలని ఆయన తెలిపారు

బూత్ స్థాయి అధికారులు ఇప్పటి వరకు నిర్వహించిన సార్ సర్వేను నిబంధనలకు అనుగుణంగా త్వరిత గతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో ప్రజలందరూ భాగస్వామ్యం కావాలని, అర్హులైన ప్రతి ఒక్కరి వివరాలు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా సహకరించాలని ఆయన పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో వాలసి గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ సెంబి సన్యాసిరావు అరకు మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు పాంగి నాగేశ్వరరావు మండల బూత్ కమిటీ అధ్యక్షుడు సేమి సుందరరావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు చొంపి రామ్మూర్తి సచివాలయ సిబ్బంది పలువురు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్.కే.కే కాలేజీలో ఘనంగా ఏబీవీపీ 78వ ఫౌండేషన్ దినోత్సవ వేడుకలు..

**పాతపట్నం, జూలై 10 మనసులో మాట:**



పాతపట్నం నియోజకవర్గం మెలియాపుట్టి మండలం చాపరలోని ఎస్.కే.కే ఇంటర్మీడియట్ కాలేజీలో అఖిల భారత విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 78వ ఫౌండేషన్ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు, అధ్యాపకులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమానికి శ్రీ రామ డెంటల్ క్లినిక్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సలాన శరత్ కుమార్, ఆధ్యాత్మికవేత్త అలియానా వినయ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ శరత్ కుమార్ మాట్లాడుతూ స్వామి వివేకానంద బోధనలు నేటి యువతకు ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. "లేవండి.. మేల్కొనండి.. గమ్యం చేరే వరకు విశ్రమించకండి" అనే స్వామి వివేకానంద సందేశాన్ని విద్యార్థులకు గుర్తు చేస్తూ, విద్యతో పాటు క్రమశిక్షణ, సమాజం పట్ల బాధ్యత, సేవాభావం అలవర్చుకోవాలని సూచించారు. ఆధ్యాత్మికవేత్త అలియానా వినయ్ మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తి, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించడంలో ఏబీవీపీ వంటి జాతీయ విద్యార్థి సంస్థలు విశిష్ట పాత్ర పోషిస్తున్నాయని అన్నారు. దేశాభివృద్ధికి యువత తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.

వేడుకల్లో భాగంగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం దేశ నిర్మాణంలో చురుకుగా భాగస్వాములమవుతామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాష్ట్ర బిజెపి అధ్యక్షులు మాధవ్ ను కలిసిన ఎర్రా వెంకట్రావు

**చీడికాడ, జూలై 10, (మనసులో మాట)**



రాష్ట్ర బిజెపి అధ్యక్షులు పివి మాధవ్ ను జిల్లా బిజెపి ఓబిసిసేల్ అధ్యక్షులు ఎర్రా వెంకటరావు శుక్రవారం కలిశారు రాష్ట్ర బిజెపి అధ్యక్షులుగా మాధవ్ పదవి చేపట్టి సంవత్సరం పూర్తయింది సందర్భంగా వెంకట్రావు కలిసి శుభాకాంక్షలు తెలిపారు ఈ సందర్భంగా వెంకటరావు మాట్లాడుతూ రాష్ట్రంలో బిజెపి మాధవ్ ఆధ్వర్యంలో గ్రామస్థాయి నుండి పటిష్టమవుతుందన్నారు బిజెపిలో నాయకులు కార్యకర్తలును మాధవ్ కలుపుకొని పోతు మంచిగా గుర్తింపు పొందుతున్నారు అన్నారు ఆయన సారథ్యంలో బిజెపి గ్రామస్థాయిని రాష్ట్ర వరకు మరింత ప్రటిష్టమవుతుందని వెంకట్రావు అన్నారు

# ప్రజలకు మరింత సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం.....



- శాసనసభ్యులు గణబాబు వెల్లడి.....

**మల్కాపురం: జూలై 10: (మనసులో మాట)**

రాష్ట్ర ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని విశాఖ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్, గణబాబు పేర్కొన్నారు. గాజువాక ఆర్టీసీ డిపో వద్ద ఏర్పాటుచేసిన విద్యుత్ బస్సుల" ఛార్జింగ్ స్టేషన్' పనులను పర్యవేక్షిస్తూ, ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకుని పనులను మరింత వేగవంతం చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# బాలారం గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు 'మినరల్ వాటర్ ప్లాంట్కి

- చొరవ చూపిన ఎం.వి.వి. ప్రసాద్



**కొయ్యూరు, జూలై 10 (మనసులో మాట):**

కొయ్యూరు మండలం బాలారం పంచాయతీ పరిధిలోని బాలారం గ్రామంలో పెరుగుతున్న మూత్రపిండాల సంబంధిత వ్యాధులపై స్పందించిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి, జిసిసి మాజీ చైర్మన్ ఎం.వి.వి. ప్రసాద్, గ్రామ ప్రజలకు సురక్షితమైన తాగునీటిని అందించేందుకు చర్యలు చేపట్టారు.గ్రామస్తులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలను, స్వచ్ఛమైన తాగునీటి ఆవశ్యకతను గుర్తించిన ఆయన, రాంకీ ఫౌండేషన్ డైరెక్టర్ శ్రీకాంత్‌ను కలిసి ఈ విషయమై విన్నవించారు. ప్రజల ఇబ్బందులను సానుభూతితో అర్థం చేసుకున్న శ్రీకాంత్, బాలారంలో తక్షణమే మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు సానుకూలంగా స్పందించారు. త్వరలోనే ఈ ప్లాంట్‌ను అందుబాటులోకి తీసుకువస్తామని ఆయన హామీ ఇచ్చారు.ఈ మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటుతో కేవలం బాలారం గ్రామమే కాకుండా, పరిసరాల్లోని మొత్తం ఆరు పంచాయతీల ప్రజలకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులోకి రానుంది. దీనివల్ల ప్రజల ఆరోగ్య స్థితిగతులు మెరుగుపడతాయని గ్రామస్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో అప్పన ఆనంద్, సూరిశెట్టి రమణ, ఇందన సత్య నారాయణ, మొండెం రాము, మువ్వల గిరి తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా ఓటర్ల జాబితా సవరణ

- జిల్లా కలెక్టర్ ప్రభాకర్ రెడ్డి

**పార్వతీపురం జిల్లా ప్రతినిధి, జూలై 10 మనసులో మాట :**

జిల్లాలో ఓటర్ల జాబితా సవరణ, పోలింగ్ కేంద్రాల హేతుబద్ధీకరణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, నిబంధనల ప్రకారం చేపట్టడం జరుగుతోందని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. ఎన్.ప్రభాకర రెడ్డి పేర్కొన్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1200 మంది ఓటర్లు మాత్రమే ఉండాలని భారత ఎన్నికల సంఘం స్పష్టం చేసిన నేపథ్యంలో, అంతకంటే ఎక్కువ మంది ఓటర్లు ఉన్న చోట ఓటర్ల సౌకర్యార్థం పోలింగ్ కేంద్రాలను విభజన చేస్తూ కొత్త కేంద్రాల ఏర్పాటుకు జిల్లా యంత్రాంగం ప్రతిపాదనలను సిద్ధం చేసిందన్నారు. ఈ తుది ప్రతిపాదనలను త్వరలోనే కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించనున్నట్లు చెప్పారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల వ్యాప్తంగా భవనాల లభ్యత, భౌగోళిక పరిస్థితులను బట్టి నాలుగు ఫార్మాట్ల ఆధారంగా మార్పులు, చేర్పులతో ప్రతిపాదనలు రూపొందించడం జరిగిందన్నారు.



పాలకొండ నియోజకవర్గంలో భవనాల లభ్యత, ఇతర కారణాల రీత్యా 2 పోలింగ్ కేంద్రాల స్థానాలను మార్చడం జరిగిందని, 5 కేంద్రాల పేర్లను సవరించారన్నారు. అలాగే 1200 మంది కంటే ఎక్కువ ఓటర్లు ఉన్నందున అత్యధికంగా 20 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని అన్నారు. కురుపాం నియోజకవర్గంలో లొకేషన్ మార్పులు గానీ, పేర్ల సవరణలు గానీ ఏవీ లేవని, కేవలం 3 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు మాత్రమే ప్రతిపాదనలు ఉన్నట్లు తెలిపారు. పార్వతీపురం నియోజకవర్గంలో లొకేషన్, పేర్ల మార్పులు ఏవీ లేకుండానే, కేవలం 9 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని అన్నారు. సాలూరు నియోజకవర్గంలో భౌగోళిక పరిస్థితులు, హాబిటేషన్ల దూరాన్ని దృష్టిలో ఉంచుకుని ఇక్కడ 5 కేంద్రాల లొకేషన్ మార్పు, 3 కేంద్రాల పేర్ల సవరణతో పాటు 13 కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయడం జరిగిందని వివరించారు. హేతుబద్ధీకరణ ప్రతిపాదనలు మరియు ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను, తాజా సమాచారాన్ని ఈ సమావేశం ద్వారా వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధుల దృష్టికి తీసుకువస్తున్నట్లు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ వివరించారు. ఈ సమావేశంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, వివిధ రాజకీయ పక్షాల ప్రతినిధులు, ఎన్నికల విభాగం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన ఈ అర్ ఓ





**ఎస్.రాయవరం, జూలై10, (మనసు లోమాట):**

ఎస్ రాయవరం మండలంలో కొనసాగుతున్న ఓటర్ జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి రమామణి శుక్రవారం పరిశీలించారు. మండలంలోని ఎస్ రాయవరం, సర్వసిద్ధి, పేట సూది పురం, సైతారు పేట గ్రామాల్లోని సర్ కార్యక్రమం పై ఆమె సమీక్ష నిర్వహించారు. నిర్ణీత సమయంలోగా సవరణ కార్యక్రమం పూర్తిచేయాలని, డిజిటలైజేషన్ ప్రక్రియను సకాలంలో పూర్తయ్యేలా చూడాలని బి ఎల్ వో ను ఆదేశించారు.ఈ సందర్భంగా బిఎల్ఓ లకు పలు సూచనలు చేశారు. బిఎల్వోలు పారదర్శకంగా వాటర్ జాబితా సవరణను నిర్వహించాలని, మృతి చెందిన ఓటర్లతోపాటు డబల్ ఎంట్రీ, పూర్తిస్థాయిలో వేరొక ప్రాంతంలో స్థిరపడిన వారిని ఓటర్ జాబితాల నుండి తొలగించాలని ఆమె సూచించారు. ఆమె వెంట స్థానిక ఇంచార్జ్ తహసిల్దార్ నీరజ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల హక్కుల సాధన కోసం ధర్నా

**పాలకొండ, జులై 10,మనసులో మాట :**



ఉద్యోగుల హక్కుల సాధన కోసం ఏపీ జేఏసీ అమరావతి ఆధ్వర్యంలో మొదటి ఉద్యమ సన్నద్ధం సభ 2026 జూలై 12 (ఆదివారం) ఉదయం 9.00 గంటలకు శ్రీకాకుళం అంబేద్కర్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించబడుతుందని సంఘ నాయకులు తెలిపారు.

ఈ సభలో ఉద్యోగుల ప్రధాన సమస్యలైన పే రివిజన్ కమిషన్ నియామకం, ఐ ఆర్ ప్రకటించడం, డి. ఏ లు, ఎస్. ఏ ల్ బకాయిల చెల్లింపు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు, రిటైర్డ్ ఉద్యోగుల హక్కులు, పే స్లిప్‌లో బకాయిల ప్రతిబింబం, పదోన్నతులు, సీనియారిటీ తదితర అంశాలపై ఉద్యమ కార్యాచరణ ప్రకటించబడుతుంది. అందువల్ల ఏపీ జేఏసీ అమరావతి అనుబంధ అన్ని ఉద్యోగ సంఘాల నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు మరియు అన్ని శాఖల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ మొదటి ఉద్యమ సన్నద్ధం సభను విజయవంతం చేయవలసిందిగా జిల్లా రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు జి. శ్రీరామూర్తి పాలకొండ రెవెన్యూ డివిజన్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం. సావిత్రి సంయుక్తంగా పిలుపునిచ్చారు.

## కొండపై నుంచి బండ పడి గ్రానైట్ కార్మికుడు మృతి

**టెక్కలి, జులై 10 (మనసులో మాట)**



టెక్కలి నియోజకవర్గం కోటబొమ్మాళి మండలం దుప్పలపాడు కొండ వద్ద జరుగుతున్న గ్రానైట్ పనులలో భాగంగా శుక్రవారం సాయంత్రం కొండపై నుంచి బండ పడి మండలం రేగులపాడు గ్రామానికి చెందిన పల్లి ఎర్రయ్య (62) మృతి చెందాడు. కొండపై పనులు జరుగుతుండగా కొండ కింద మరికొంతమంది పనులు నిర్వహిస్తున్నారు. కొండపై నుంచి బండ దొర్లుకుంటూ వచ్చి ఎర్రయ్య పై పడింది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఎర్రయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు ఎర్రయ్యకు భార్య పార్వతి, వివాహితులైన కుమార్తెలు కింజరాపు ఉమా, దేశల్ల హేమలత ఉన్నారు. ఉమా భర్తతోపాటు హైదరాబాదులో కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుంది. హేమలత గ్రామం లోనే ఉంటుంది. కుటుంబాన్ని పోషించాల్సిన పెద్దదిక్కును కోల్పోయామని కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ఈ సంఘటనలో మరికొద్ది మంది కార్మికులకు స్వల్పంగా గాయాలయ్యాయి. ఈ మేరకు కోటబొమ్మాళి ఎస్సై వి. సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## దీర్ఘ కాలిక వ్యాధులకు ఆయుర్వేదంతో ప్రయోజనం

**నక్కపల్లి, జూలై 10 (మనసులో మాట):**

అనేక దీర్ఘకాలిక వ్యాధులను ఆయుర్వేద వైద్యంతో సునాయాసంగా నయం చేసుకోవచ్చునని టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కురందాసు నూకరాజు అన్నారు. మండలంలోని జానకయ్యపేట గ్రామంలో శుక్రవారం వేంపాడు ఆయుర్వేద ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నూకరాజు మాట్లాడుతూ లక్షలాది రూపాయలు వెచ్చించినా నయం కాని



మొండి రోగాలు ఆయుర్వేద వైద్యంతో ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ సుమారు 120 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ కె.రఘు మాట్లాడుతూ పిల్లల నుంచి పెద్దల వరకూ అన్ని రకాల వ్యాధులకు ఆయుర్వేద ఆస్పత్రిలో మందులు పుష్కలంగా ఉన్నాయని చెప్పారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కురందాసు నాగ సత్యవేణి, సీనియర్ ఫార్మసిస్ట్ భీశెట్టి రామకృష్ణ, యోగా టీచర్ డీవన్నీ సాయి తదితరులు పాల్గొన్నారు.

## కూటమి హయాంలో మత్స్యకారులకు 500 కోట్ల నిషేధ భృతి

- జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు చీకటి శ్రీరాములు

**టెక్కలి, జూలై 10 (మనసులో మాట) :**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో రాష్ట్రంలో అర్హత ఉన్న మత్స్యకారులకు రూ.500 కోట్లతో వేట నిషేధ భృతి అందించినట్లు జిల్లా మత్స్యకార సహకార సంఘం అధ్యక్షులు చీకటి శ్రీరాములు తెలిపారు. సంతబొమ్మాళి మండలం నౌపాడలో శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పి ఎం ఎస్ ఎస్ వై పథకంలో మత్స్యకారులకు 50% సబ్సిడీపై బోట్లు , తెప్పలు ,ఇంజన్, వలలు 300 యూనిట్లు అందించినట్లు వివరించారు. అదేవిధంగా ద్విచక్ర, మూడు, నాలుగు చక్రాల వాహనాలు సబ్సిడీ పై అందిసినట్లు వివరించారు. జిల్లాలో అత్యంత వెనుకబడిన మత్స్యకార గ్రామాలు దేవునాల్తడ , పెద్దగంగానపేట, ఇద్దువానిపాలెంలో రెండు కోట్లు రూపాయలు చొప్పున ప్రత్యేక సిఆర్పిపి నిధులతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఎచ్చర్ల మండలం బుడగట్లపాలెం వద్ద రూ. 444 కోట్లతో ఫిషింగ్ నిర్మాణానికి కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించినట్లు వివరించారు. గత వైకాపా హయంలో జిల్లాలో ప్రమాదవశాత్తు వేటకు వెళ్లి మృతి చెందిన 35 మందికి నష్ట పరిహారం అందజేయలేదని, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సహకారంతో వీరందరికీ రూ 5 లక్షల చొప్పున నష్టపరిహారం అందించినట్లు తెలిపారు. విశాఖలో జరిగిన సంఘటనలో మత్స్యకారులకు రూ .10 లక్షలు చొప్పున నష్టపరిహారం ఇవ్వడం అభినందనీయమని , మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వం తో సాధ్యమవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొవ్వాడ మత్స్యకార సొసైటీ అధ్యక్షుడు బైపల్లి అప్పన్న, ఏఎంసీ డైరెక్టర్ సూరాడ ధనరాజ్ , జిల్లా తెలుగు యువత కార్యదర్శి సూరాడ దాసురాజ్ తదితరులు పాల్గొన్నారు.



# ఖరీఫ్‌కు సమృద్ధిగా ఎరువుల నిల్వలు

- బఫర్ స్టాక్‌తో ప్రభుత్వం అప్రమత్తం
- రాష్ట్రవ్యాప్తంగా ఎరువుల సరఫరా కొనసాగుతోంది
- రైతులకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు : మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

**శ్రీకాకుళం/అమరావతి, జిల్లా ప్రతినిధి, జూలై 10 , మనసులో మాట:**



ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా, డీఏపీతో పాటు అన్ని రకాల ఎరువులను ప్రభుత్వం సమృద్ధిగా అందుబాటులో ఉంచిందని, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం జులై 10వ తేదీ నాటికి 3.70 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా, 0.90 లక్షల మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు అందుబాటులో ఉన్నాయని శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మంత్రి మాట్లాడుతూ, రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాల వారీగా మార్క్‌ఫెడ్ గోదాముల్లో తగిన బఫర్ స్టాక్‌ను నిల్వ ఉంచామని, ఎక్కడైనా నిల్వలు తగ్గిన వెంటనే అదనపు ఎరువులను తరలించేలా అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. చాలా కంపెనీల నుంచి ఎరువుల స్టాక్‌ను వ్యవసాయ శాఖ స్వాధీనం చేసుకుని ప్రభుత్వ గోదాముల్లో భద్రపరుస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 3,69,646 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉండగా, ఇది ఖరీఫ్ అవసరాల్లో 85 శాతం మేరకు సరిపోతుందని మంత్రి తెలిపారు. అలాగే 85,683 మెట్రిక్ టన్నుల డీఏపీ నిల్వలు ఉండగా, ఇది ప్రస్తుత సీజన్ అవసరాల్లో 64 శాతం మేర అందుబాటులో ఉందన్నారు. అవసరానికి అనుగుణంగా నిరంతరం అదనపు ర్యాకులు రాష్ట్రానికి చేరుతున్నాయని, రైతులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా సరఫరా కొనసాగుతోందని స్పష్టం చేశారు. యూరియా నిల్వల పరంగా అన్ని జిల్లాల్లో అవసరమైన బఫర్ స్టాక్‌ను ఉంచామని, డీఏపీ పంపిణీ కూడా ప్రణాళిక ప్రకారం కొనసాగుతోందని తెలిపారు. జిల్లాల వారీగా నిల్వలు, వినియోగాన్ని ప్రతిరోజూ సమీక్షిస్తూ అవసరమైన చోట వెంటనే అదనపు నిల్వలు తరలిస్తున్నామని చెప్పారు. విజయనగరం జిల్లాలోని రేగిడి అమదాలవలస మండలం సంకిలి రైతు సేవా కేంద్రం వద్ద జరిగిన ఘటనపై మంత్రి అచ్చెన్నాయుడు స్పందించారు. సంకిలి ఆర్ఎస్‌కే పరిధిలో 731 ఎకరాల వరి, 90 ఎకరాల ఉద్యాన పంటలు, 80 ఎకరాల చెరకు సాగు పరిధి ఉండగా, ప్రస్తుతం 90 ఎకరాల వరి, 80 ఎకరాల చెరకు మాత్రమే సాగు జరిగిందన్నారు.

## ఏటికొప్పాక హస్తకళాకారులకు ఉచిత వైద్య శిబిరం

- ప్రపంచ స్థాయిలో గుర్తింపు చేస్తున్న ఏటికొప్పాక హస్త కళలు ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

**యలమంచిలి టౌన్, జూలై 10, మనసులో మాట,**



మండలంలోని ఏటికొప్పాక గ్రామంలో లక్క బొమ్మలు తయారు చేసే హస్తకళాకారుల నైపుణ్యం ప్రపంచ స్థాయికి ఎదుగుతుంది అని శాసనసభ్యులు సుందరపు విజయకుమార్ అన్నారు.శుక్రవారం నాడు ప్రత్యేక ఉచిత వైద్య శిబిరాన్ని విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇటీవల విజయవాడలోని లేపాక్షి ఆడిటోరియంలో హస్తకళాకారుల కోసం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని అక్కడ ప్రదర్శించిన ఏటికొప్పాక హస్త కళా ఖండాలను డిప్యూటీ సీఎం పవన కళ్యాణ్ వీక్షించి కళాకారులను అభినందించారు.అదే స్ఫూర్తితో ఇప్పుడు ఏటికొప్పాకలో కూడా ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామని, హస్తకళాకారులు ఎక్కడ ఉన్నా వారందరికీ ఉచిత వైద్య సేవలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చారు. ప్రపంచ ప్రసిద్ధి చెందిన ఏటికొప్పాక లక్క బొమ్మల తయారీకి అవసరమైన అంకుడు చెక్క, లక్క వంటి ముడి పదార్థాల కొరత లేకుండా చూసేందుకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారని ఎమ్మెల్యే విజయ్ కుమార్ పేర్కొన్నారు. అటవీ శాఖతో సమన్వయం చేసుకుంటూ, కళాకారులకు అవసరమైన ముడి పదార్థాలను సులభంగా అందుబాటులోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎం.పి.పి. రాజాన సూర్య చంద్ర శేషగిరి (శేషు) కూటమి నాయకులు కాండ్రకోట చిరంజీవి ,అన్నం బాబ్జి,శానా నాని,వైద్య సిబ్బంది, హస్తకళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అనారోగ్యానికి గురైన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరం...

**అనకాపల్లి టౌన్ జూలై 10 మనసులో మాట**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ చొరవతో పేదల ఆరోగ్య రక్షణకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా విశేషసహాయం అందుతోంది. మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి నియోజకవర్గానికి చెందిన అత్యవసర చికిత్స పొందిన 7 గురు లబ్ధిదారులుగాను రూ.3,01,443 విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను జనసేన పార్టీ అనకాపల్లి ఇన్‌చార్జ్ భీమరశెట్టి రామ్కి జనసేన పార్టీ కార్యాలయంలో వారి కుటుంబ సభ్యులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా రామ్కి మాట్లాడుతూ, ఖరీదైన వైద్య చికిత్సలు చేయించుకోలేని నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఒక వరమని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులతో చికిత్సకు నోచుకోలేని కుటుంబాలకు ఈ పథకం గొప్ప భరోసాగా నిలుస్తోందన్నారు. గత 24 నెలల కాలంలో అనకాపల్లి నియోజకవర్గంలో వందలాది మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందజేసినట్లు తెలిపారు. భవిష్యత్తులో కూడా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఈ సహాయం అందేలా కృషి కొనసాగుతుందని చెప్పారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ , అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణకి తమ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే చెక్కును అందజేసిన రామ్కి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## భీమరశెట్టి రామ్ చేతులమీదుగా రథయాత్ర ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ



**అనకాపల్లి టౌన్ జూలై 10 మనసులో మాట**

గవరపాలెం అగ్నిమర్రిచెట్టు వద్ద వేంచేసి ఉన్న సుభద్ర బలభద్ర సమేత జగన్నాథ స్వామి వారి దేవస్థానంలో, దేవాదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల జూలై 16 నుంచి 25, 2026 వరకు మాజీ మంత్రి, అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ ముఖ్య ప్రోత్సాహంతో నిర్వహించనున్న రథయాత్ర మహోత్సవం ఆహ్వాన పత్రికను అనకాపల్లి జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్కి చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రథయాత్ర మహోత్సవాలు భక్తి శ్రద్ధలతో, వైభవంగా నిర్వహించేందుకు దేవాలయ కమిటీ ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ దాడి బుజ్జి , దేవస్థాన ధర్మకర్తలు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## జీరుపాలెంలో అద్భుతంగా క్రీస్తు విజ్ఞాన మహా సభ





**ఎచ్చెర్ల, జూన్ 10, మనసులో మాట:**

శ్రీకాకుళం జిల్లా, రణస్థలం మండలం జీరుపాలెం గ్రామంలో ఈ రోజు జరిగిన క్రీస్తు సంపూర్ణతపై నీ విశ్వాసం ఏమిటి? అనే అంశం పై క్రీస్తు విజ్ఞాన మహా సభ అత్యంత ఆసక్తికరంగా, ఘనంగా జరిగింది. ఈ మహా సభకు రణస్థలం మండలం మరియు పరిసర మండలాలనుండి అనేక మంది క్రైస్తవ భక్తులు వందలాది మంది తరలి వచ్చారు. స్థానిక జీరుపాలెం, కోటపాలెం, మింది పేట, సీతారామ పురంలలో క్రీస్తు పరిచర్య చేస్తున్న పాస్టర్ రెవరెండ్ సి. హెచ్. రూబెన్ ఆధ్వర్యంలో జరిగింది. లావేరు, రణస్థలం మరియు ఎచ్చెర్ల మండల పాస్టర్స్ ఫెలోషిప్ సహకారంతో బైబిల్ ట్రస్ట్ ఇంటర్నేషనల్ మినిస్ట్రీస్ హైదరాబాద్ నుండి బిషప్,డా.ఆర్.ఐ.వంశీధర్ వాక్యోపదేశం చేసారు. ఆయన చేసిన త్రియేక దేవుని గురించిన వివరణ, క్రీస్తు యేసుని యొక్క రక్షణ గురించిన సందేశం ఆద్యంతం అత్యంత ఆసక్తిగా జరిగినది. ఈ మహాసభలో స్థానిక గ్రామ పెద్దలు మరియు అనేక మంది ప్రజలు పాల్గొన్నారు.

## సర్ ఓటర్ సర్వే గురించి అడిగి చేసుకున్న కిముడు పల్లి ఎంపీటీసీ....

**పెదబయలు జూలై 10 మనసులో మాట :**



అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం కిముడుపల్లి పంచాయితీ సచివాలయం బి ఎల్ ఓ ల తో 23 గ్రామాల ఓటర్ సర్వే ప్రక్రియ గురించి పెదబయలు మండల ఎమ్మార్వో అలాగే ఆర్ఐ ల తొ మాట్లాడిఅడిగి తెలుసుకోవడం జరిగింది అలాగే కిముడుపల్లి 23 గ్రామస్తులందరూ కూడా ఇంకా మిగిలి ఉన్నది నాలుగు రోజులు మాత్రమే ఎవరైతే ఓటర్ సర్వే చేయించుకోలేదో వాళ్లందరూ కూడా బి ఎల్ ఓ స్ ఇవ్వగలరు అలాగే ప్రతి ఒక్క అంగన్వాడీస్ కూడా మీ అప్లికేషన్ ని ఇవ్వవచ్చు కాబట్టి ఎవ్వరు కూడా మిస్ అవ్వద్దు ఒకసారి మిస్ అవుతే ఎమ్మార్వో చుట్టూ ఎంపీడీవో చుట్టూ తిరగాల్సి వస్తుంది ఇంకా పెండింగ్ ఉంది అని చెప్తున్నారు బిఎల్ఓస్ ప్రతి ఒక్క గ్రామస్తులు ప్రతి ఒక్క యువత కూడా తప్పకుండా వినియోగించుకుంటారని కోరుతున్నానని యువ నాయకుడు పాంగి రామారావు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తెలిపారు

# అనకాపల్లి జనసేన కార్యాలయంలో ప్రజా సమస్యల వినతులు...

**అనకాపల్లి టౌన్ జూలై 10**
**మనసులో మాట**



జనసేన పార్టీ కార్యాలయంలో స్థానిక అనకాపల్లి నియోజకవర్గ ప్రజల, కూటమి కార్యకర్తలు నుండి వారి సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను స్వీకరించారు. సమస్యలను విన్న అనకాపల్లి నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ భీమరశెట్టి రామ్కి వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి మాజీ మంత్రి అనకాపల్లి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణ దృష్టికి తీసుకువెళ్లి అతి త్వరలోనే పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని ప్రజలకు కార్యకర్తలకు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా, ప్రజల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా నిలబడుతుందని ఆయన తెలియజేశారు.

# కంపోస్టు కాలనీ సచివాలయాన్ని సందర్శించిన భారత ఎన్నికల సంఘం అధికారులు

**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జూలై,10,**
**మనసులో మాట,:**



భారత ఎన్నికల సంఘం అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా శుక్రవారం కంపోస్టు కాలనీ సచివాలయాన్ని సందర్శించారు. కలెక్టరేట్ లో ఈఆర్ఓలతో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ 2026 (సర్) సమీక్ష అనంతరం సందర్శించి ఎన్యూమరేషన్ ఫారాలు ఏ విధంగా చేస్తున్నదీ బిఎల్ఓ వేణుగోపాల్ రెడ్డిని భారత ఎన్నికల సంఘం ముఖ్య కార్యదర్శి అవినాష్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. ఫారాలు ఎన్ని వచ్చాయి, ఎంత శాతం వచ్చాయనే వివరాలను అడిగారు. ఆన్ లైన్ ప్రోసెస్ ఏ విధంగా జరుగుతోందని, ఓటర్ల నమోదు గూర్చి అడిగి సంతృప్తి వ్యక్తం చేశారు.

# అనకాపల్లి లో 'లెనిన్' విజయంతో మిన్నంటిన సంబరాలు

- **అక్కినేని అభిమానుల కోలాహలం**

**అనకాపల్లి ప్రతినిధి, జులై 10**
**(మనసు లో మాట ):**



అక్కినేని అఖిల్ కథానాయకుడిగా నటించిన "లెనిన్" చిత్రం విడుదలై ఘన విజయం సాధించడం తో అక్కినేని అభిమానులలో సందడి నెలకొంది. అనకాపల్లి లో అక్కినేని ఫ్యామిలీ ఫ్యాన్స్ ఆధ్వర్యంలో వేడుకలు శుక్రవారం అంబరాన్నంటాయి. అనకాపల్లి శ్రీ వెంకటేశ్వర థియేటర్ ప్రాంగణంలో అభిమానులు అత్యంత వైభవంగా ఈ విజయోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర హాజరయ్యారు. థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు, ప్రత్యేక అలంకరణలు అందరినీ ఆకట్టుకున్నాయి. తీన్మార్ డప్పుల మోతలు, బాణసంచా పేలుళ్ల మధ్య అభిమానుల కోలాహలంతో థియేటర్ పరిసరాలు పండగ వాతావరణాన్ని తలపించాయి. ముందుగా మళ్ళ సురేంద్ర అభిమానులతో కలిసి కేక్ కట్ చేసి, 'లెనిన్' చిత్రం అఖిల్ కెరీర్‌లోనే మైల్ రాయిగా నిలుస్తుందని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం లో అనకాపల్లి పట్టణ కింగ్ నాగార్జున ఫ్యాన్స్ అధ్యక్షులు సిహెచ్ అవతారం (అవ్వ), పట్టణ నాగచైతన్య అండ్ అఖిల్ ఫ్యాన్స్ అధ్యక్షులు ఎస్. భానుచందర్ (అఖి), 82, 83 డివిజన్ల టిడిపి ఇంచార్జ్ పోలరపు త్రినాథ్, బొద్దపు ప్రసాద్, శ్రీ వెంకటేశ్వర థియేటర్ యాజమాన్యం మళ్ళ వెంకట్రావు తో పాటు అనకాపల్లి అక్కినేని ఫ్యామిలీ ఫ్యాన్స్ దుర్గ నాయుడు, కృష్ణ, మల్లేష్, రియాజ్, నాని, సత్యనారాయణ, చంటి, మురళి, అఖిల్, భారీ సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణలో శ్రీకాకుళం ఆదర్శంగా నిలవాలి

**శ్రీకాకుళం, జిల్లా ప్రతినిధి, జులై 10 ,**
**మనసులో మాట:**






ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో అర్హత కలిగిన వారిది ఒక్క ఓటు కూడా పోవడానికి వీల్లేదని, అనర్హుల పేర్లు జాబితాలో ఉండటానికి వీల్లేదని కేంద్ర ఎన్నికల సంఘం ప్రిన్సిపల్ సెక్రటరీ అవినాశ్ కుమార్ స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పరిశీలనలో భాగంగా అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్‌తో కలిసి శుక్రవారం శ్రీకాకుళం విచ్చేసిన ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో విశ్వేశ్వర రావు, అన్ని నియోజకవర్గాల ఈఆర్వోలతో ప్రత్యేకంగా సమీక్షించారు. ఈ సందర్భంగా అవినాశ్ కుమార్ మాట్లాడుతూ.. జిల్లాలో నిర్వహించే ఎస్ఐఆర్ ప్రక్రియ రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ఆదర్శంగా నిలవాలని, ఆ దిశగా అధికారులు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ ప్రక్రియలో ఈఆర్వోలు కీలక పాత్ర పోషించాలని, ప్రతి చిన్న అంశాన్నీ క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు పారదర్శకంగా ఉండేలా చూడాలని సూచించారు. ఈఆర్వోలు తప్పకుండా తమ పరిధిలోని పోలింగ్ స్టేషన్లను సందర్శించాలని, తక్కువ ఫలితాలు నమోదైన చోట క్షేత్రస్థాయి పర్యటనలు చేసి లోపాలను విశ్లేషించుకోవాలని ఆదేశించారు.
పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియను సహేతుకంగా నిర్వహించి ప్రతిపాదనలు నివేదించాలని, డిజిటలైజేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని దిశానిర్దేశం చేశారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో వెనుకబడిన పోలింగ్ స్టేషన్ల వివరాలను అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్ వివరిస్తూ.. తక్షణమే దిద్దుబాటు చర్యలు చేపట్టాలని సూచించారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియకు మూడు రోజులే సమయం ఉన్నందున తక్షణమే పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, ఓటర్లకు పూర్తి అవగాహన కల్పిస్తున్నామని అన్నారు.
ఎస్ఐఆర్ ప్రక్రియ అనేది పూర్తిగా భారత రాజ్యాంగానికి, ఎన్నికల చట్టాలకు అనుగుణంగా జరుగుతుందని, అర్హత గల ఏ ఒక్క ఓటరు మిస్ కాకూడదని, అదే సమయంలో షిఫ్టెడ్, డెత్, డూప్లికేట్ ఓటర్లను తొలగించడం కూడా అత్యంత ఆవశ్యకమని స్పష్టం చేశారు. ఖచ్చితమైన ఓటర్ల జాబితా తయారీకి ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందని, పూర్తి పారదర్శకంగా దీనిని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్, ఈఆర్వోలు పద్మావతి, సాయి ప్రత్యూష, కృష్ణమూర్తి నాయుడు, జయదేవి, వినాయకం రెడ్డి, అప్పలరాజు, లావణ్య తదితరులు పాల్గొన్నారు.

# రవీంద్ర భారతి స్కూల్ లో సామూహిక అక్షరాభ్యాసం

**పాలకొండ, జులై 10,మనసులో మాట:**



స్థానిక హాస్పిటల్ రోడ్డులోని రవీంద్ర భారతి పాఠశాల ఆవరణలో నూతన విద్యార్థుల కొరకు "సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం" అత్యంత వైభవంగా సాంప్రదాయబద్ధంగా నిర్వహించబడింది. విద్యా దేవత అయిన శ్రీ సరస్వతీ దేవి ప్రత్యేక పూజలతో ప్రారంభమైన ఈ వేడుకలో పాఠశాల చైర్మన్ ఎమ్. సుబ్రహ్మణ్యం (మణి) ముఖ్య అతిథిగా వర్చువల్ గా, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్మన్ ఎమ్. సుబ్రహ్మణ్యం (మణి) మాట్లాడుతూ ప్రతి బిడ్డ జీవితంలో అక్షరాభ్యాసం అనేది ఒక పవిత్రమైన ఘట్టమని, చిన్నారుల విద్యా ప్రయాణానికి తమ పాఠశాల ద్వారా ఒక శుభారంభం పలకడం సంతోషంగా ఉందన్నారు. రవీంద్ర భారతి విద్యా సంస్థలు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతికతతో కూడిన నాణ్యమైన విద్యను, నైతిక విలువలను చిన్నారులకు అందిస్తాయని ఆయన హామీ ఇచ్చారు. నూతన విద్యా సంవత్సరంలో చేరిన నర్సరీ, ప్రిస్కూల్ చిన్నారుల చేత పాఠశాల ప్రిన్సిపల్ ఎం. టినేష్ స్వయంగా పలకలపై అక్షరాలు దిద్దించి విద్యాబుద్ధులను ప్రారంభించారు.సరస్వతీ దేవి చిత్రపటానికి వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, చిన్నారులకు అక్షరదీక్షచేయించారు.సరికొత్తగా పాఠశాలవాతావరణంలోకి అడుగుపెట్టిన చిన్నారులకు తల్లిదండ్రులకు స్వాగతం పలుకుతూ క్లాస్ రూమ్‌లను, స్కూల్ ఆవరణను రంగురంగుల బెలూన్లు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.ఈ విద్యా ఉత్సవంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న తల్లిదండ్రులు.. పాఠశాల యాజమాన్యం కల్పించిన ఏర్పాట్లు సాంప్రదాయ వాతావరణం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి అసలైన ప్రాణాధారం

- **చల్లవానిపేట గ్రామంలో పార్టీ క్యాడర్ సమావేశం**

**శ్రీకాకుళం/నరసన్నపేట, జులై 10,**
**మనసులో మాట..**



జలుమూరు మండలం, చల్లవానిపేట గ్రామంలో తెలుగుదేశం పార్టీ క్లస్టర్, ఇన్చార్జ్‌లు ముఖ్య నాయకులతో కలిసి నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి సమక్షంలో ఒక పార్టీ క్యాడర్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, క్షేత్రస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయడంపై ఈ సమావేశంలో చర్చించారు. తెలుగుదేశం పార్టీకి అసలైన బలం కార్యకర్తలేనని, ప్రతి క్లస్టర్ ఇన్చార్జ్ తమ పరిధిలోని ప్రతి ఇంటినీ సందర్శించి ప్రజలతో మమేకం కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను, అభివృద్ధి పనులను ప్రజల్లోకి బలంగా తీసుకువెళ్లాల్సిన బాధ్యత నాయకులపై ఉందన్నారు. క్లస్టర్ ఇన్చార్జ్‌లు, గ్రామీణ స్థాయి ముఖ్య నాయకులు సమన్వయంతో పనిచేస్తూ, స్థానిక సమస్యల పరిష్కారానికి నిరంతరం శ్రమించాలని సూచించారు.
రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన మాట్లాడుతూ పార్టీ కోసం నిరంతరం కష్టపడే ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, వారి శ్రమకు తగిన గుర్తింపు, గౌరవం పార్టీలో లభిస్తుందని భరోసా ఇచ్చారు. తెలుగుదేశం పార్టీ విజయం క్షేత్రస్థాయి కార్యకర్తల క్రమశిక్షణ, నిరంతర శ్రమపైనే ఆధారపడి ఉంది. నాయకులు, ఇన్చార్జ్‌లు విభేదాలకు తావివ్వకుండా, ఒకే తాటిపై నడుస్తూ పార్టీ బలోపేతానికి సమిష్టిగా కృషి చేయాలని కోరారు.